తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
10 అక్టోబర్ 2026



# పూల జాతరకు వెళ్లాయే..
# నేటి నుంచి బతుకమ్మ సంబరాలు




## 18న సద్దుల బతుకమ్మ.. ముస్తాబైన పల్లెలు, పట్టణాలు

మార్కుక్, (జనం సాక్షి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతున్నాయి. పూల పండుగగా పేరుగాంచిన బతుకమ్మను తెలంగాణ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. రంగురంగుల పూలను సేకరించి అందంగా పేర్చి బతుకమ్మలను తయారు చేసి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేస్తారు. ఈ పండుగతో పల్లెలు, పట్టణాలు పూల పరిమళాలతో పండుగ శోభను సంతరించుకుంటున్నాయి.

**ప్రకృతితో ముడిపడిన పూల పండుగ...**

తంగేడు, గునుగు, బంతి, చామంతి, గుమ్మడి తదితర పూలతో బతుకమ్మలను వివిధ ఆకృతుల్లో పేర్చడం ఆనవాయితీ. మహిళలు కొత్త బట్టలు, ఆభరణాలతో ముస్తాబై బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కలిసి వేడుకల్లో పాల్గొంటారు. ప్రకృతిని ఆరాధించడం, పూలను సంరక్షించడం, మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించడం ఈ పండుగ ప్రత్యేకత.

**బతుకమ్మ వెనుక విశిష్టత...**

బతుకమ్మ పండుగకు తెలంగాణలో అనేక జానపద కథలు, విశ్వాసాలు ఉన్నాయి. అమ్మవారిని పూల రూపంలో పూజిస్తూ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మహిళలు ప్రార్థిస్తారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో బతుకమ్మను పూజించి, చివరి రోజైన సద్దుల బతుకమ్మను ఘనంగా



నిర్వహిస్తారు. పూజల అనంతరం బతుకమ్మలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసి, మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటారు.

ఒకప్పుడు గ్రామాలకే పరిమితమైన ఈ పండుగ నేడు తెలంగాణతో పాటు దేశవిదేశాల్లోనూ ఘనంగా నిర్వహిస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పే వేడుకగా బతుకమ్మ ప్రత్యేక గుర్తింపు పొందింది.

బతుకమ్మ పండుగలో ప్రతిరోజూ ప్రత్యేక నైవేద్యాలు సమర్పించడం సంప్రదాయం.

బతుకమ్మ వేడుకలు తెలంగాణ మహిళల ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తున్నాయి. సంప్రదాయ పాటలు, ఆటలు, పూల అలంకరణలతో పండుగ సంబరాలు పల్లెల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

### తొమ్మిది రోజులు.. తీరొక్క నైవేద్యాలు

**ఎంగిలిపూల బతుకమ్మ:** నువ్వులు, బియ్యం పిండి, నూకలతో నైవేద్యం తయారు చేస్తారు.

**అటుకుల బతుకమ్మ:** అటుకులు, బెల్లం, సప్పిడి పప్పు సమర్పిస్తారు.

**ముద్దపప్పు బతుకమ్మ:** ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేస్తారు.

**నానే బియ్యం బతుకమ్మ:** నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం సమర్పిస్తారు.

**అట్ల బతుకమ్మ:** అట్లు లేదా దోశలను నైవేద్యంగా పెడతారు.

**అలిగిన బతుకమ్మ:** సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిస్తారు.

**వేపకాయల బతుకమ్మ:** బియ్యం పిండితో వేపకాయల ఆకారంలో వంటకాలు తయారు చేస్తారు.

**వెన్నముద్దల బతుకమ్మ:** నువ్వులు, వెన్న లేదా నెయ్యి, బెల్లం కలిపి సమర్పిస్తారు.

**సద్దుల బతుకమ్మ:** ఐదు రకాల అన్నం, పులిహోర, పెరుగన్నం, నిమ్మకాయ అన్నం, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం వంటి నైవేద్యాలు సమర్పిస్తారు.

## ట్రాన్స్‌జెండర్లతో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ సమావేశం

**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 09 (జనంసాక్షి):** ఇటీవల వెలుగులోకి వచ్చిన కొన్ని సంఘటనల నేపథ్యంలో, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ సెషన్ నిర్వహించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ ట్రాన్స్‌జెండర్లతో నేరుగా మాట్లాడి, సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ట్రాన్స్‌జెండర్లు తమ సమస్యలను సీపీ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ... నేటి ఆధునిక యుగంలో అనేక ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయని, సమాజంలో గౌరవంగా జీవించేందుకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా మద్దతుగా ఉంటుందని హామీ ఇచ్చారు. "జిల్లాలో ఎంతమంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు, వారిలో ఉద్యోగం చేసేందుకు ఆసక్తి ఉన్నవారి వివరాలను సేకరిస్తున్నాం. చదువుకున్న వారికి ఉద్యోగాలు కల్పించేందుకు సెట్ విన్ సంస్థ ప్రతినిధులతో చర్చించి, వారికి తగిన ఉద్యోగావకాశాలు పొందేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి 'డిస్టెన్స్ లెర్నింగ్' ద్వారా చదువుకునే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. అలాగే, ఈ డిజిటల్ యుగంలో సొంతంగా నైపుణ్యం పెంచుకోవడానికి ఎన్నో 'ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫార్మ్స్' అందుబాటులో ఉన్నాయని సూచించారు. ఏదైనా ఒక మంచి స్కిల్ నేర్చుకుని ఉద్యో





గం లేదా ఉపాధి పొందితే సమాజంలో మంచి గుర్తింపు లభించడమే కాకుండా, అందరికీ ఆదర్శంగా నిలవవచ్చని పిలుపునిచ్చారు. ట్రాన్స్‌జెండర్లు ధైర్యంగా ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, సహాయ సహకారాల కోసం సిద్దిపేట పోలీస్ శాఖను ఎప్పుడైనా సంప్రదించవచ్చని సీపీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ ఏఆర్ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, గజ్వేల్ ఏసీపీ నరసింహులు, సెట్ విన్ ప్రతినిధి అమీనా భాను, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పెబ్బేరు పాలిటెక్నిక్‌లో సమస్యల తిష్ట

- **కలుషిత ఆహారంతో 40 మంది విద్యార్థులు అస్వస్థత**



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 9 (జనంసాక్షి):** పెబ్బేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 40 మంది విద్యార్థులు కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురికావడంపై బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్ శుక్రవారం కళాశాలను సందర్శించి సమస్యలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కళాశాల సమీపంలోని చెత్త కేంద్రంలో చెత్తను దహనం చేయడం వల్ల వెలువడే పొగతో విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు ఉందని, కేంద్రాన్ని తరలించాలని డిమాండ్ చేశారు.

**వసతులు కల్పించకపోతే ఆందోళన...**

250 మందికి పైగా విద్యార్థులున్న కళాశాలలో వైద్య సిబ్బంది లేకపోవడం, రాత్రివేళల్లో పర్యవేక్షణ కొరవడటం, కాపలాదారు లేకపోవడం, నెలలుగా నీటి శుద్ధి యంత్రం పనిచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికలు కూడా ఉంటున్న వసతి గృహంలో భద్రతా ఏర్పాట్లు చేయాలని, వైద్య సహాయక సిబ్బందిని నియమించాలని, తాగునీటి యంత్రానికి మరమ్మతులు చేయించాలని కోరారు. విద్యార్థుల అస్వస్థతపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షుడు అరవింద్, మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత యాదవ్, వాణిజ్య విభాగం కన్వీనర్ గోపీనాథ్, యువ నాయకులు నవీన్, రాము పాల్గొన్నారు.

# చెత్త వేరు చేయకపోవడంపై మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం

- తడి, పొడి, హానికరమైన చెత్తను మూడు రకాలుగా వేరు చేయాలి
- నిర్లక్ష్యం పునరావృతమైతే చర్యలు తప్పవు

**సిద్దిపేట, అక్టోబర్ 09 (జనంసాక్షి):** సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చెత్త పేరుకుపోవడంపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి ప్రతిరోజూ వందలాది మంది రోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు వస్తుంటారని, అలాంటి ప్రదేశంలో చెత్తను సక్రమంగా వేరు చేయకుండా నిల్వ చేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారడమే కాకుండా, వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తగా మూడు రకాలుగా వేరు చేయడం తప్పనిసరని స్పష్టం చేశారు. వేరు చేసిన చెత్తను సంబంధిత మున్సిపల్ వాహనాలకు అందించాలని, ఆసుపత్రి పరిసరాల్లో ఎక్కడా చెత్త పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యానికి సంబంధించిన విషయంలో నిర్లక్ష్యం సహించేది లేదని, చెత్త నిర్వహణలో ఇలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, చెత్త సేకరణ, వేరు చేయడం, తరలింపు ప్రక్రియలను పర్యవేక్షించాలని శానిటరి అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చెత్త పేరుకుపోవడానికి సంబంధించిన సమస్యపై మెడికల్ కాలేజ్ సూపరింటెండెంట్ డా.సంగీత, జిల్లా వైద్యాధికారి డా.ధనరాజు, ఆర్ఎంవో డా.శ్రావణి తదితర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచేం దుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇకపై ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహేష్, శివ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## బాలలక్ష్మి మృతికి
# సీపీఐ, ఏఐటీయూసీ నివాళులు



**చేర్యాల, అక్టోబర్ 9 (జనంసాక్షి):** వీరన్నపేట గ్రామానికి చెందిన ఏఐటీయూసీ హమాలీ వర్కర్స్ యూనియన్ మండల నాయకుడు పోకల కనకయ్య భార్య బాలలక్ష్మి (40) గురువారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు అందె అశోక్ శుక్రవారం ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కనకయ్యను పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల నాయకులు దండబోయిన వెంకటేష్, పొన్నబోయిన మహేందర్, చిగుళ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జపాన్ ఇంటర్నేషనల్ సేల్స్ సర్వీస్
# ప్రారంభోత్సవంలో వంగ రాజేశ్వర్ రెడ్డి



**సిద్దిపేట (జనంసాక్షి):** సిద్దిపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జపాన్ ఇంటర్నేషనల్ సేల్స్ సర్వీస్ ప్రారంభోత్సవానికి వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు, ఎండీ సల్మాన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపారం విజయవంతంగా కొనసాగుతూ మరింత అభివృద్ధి సాధించాలని, వ్యాపార రంగంలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

# రామచంద్రాపురం డివిజన్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

### కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: కమిషనర్





**రామచంద్రాపురం, అక్టోబర్ 9 (జనంసాక్షి):** రామచంద్రాపురం డివిజన్‌లోని కాలనీల సమస్యలను పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ యాదవ్ చేసిన విజ్ఞప్తి మేరకు వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ శుక్రవారం పర్యటించారు. కాకతీయనగర్, శ్రీ సాయినగర్ కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని పుష్పనగేష్ కోరారు. అనంతరం కాకతీయనగర్‌లో హెచ్ఎండీఏ నిర్మించిన థీమ్ పార్కును పరిశీలించారు. పార్కును సీఎంసీకి అప్పగించే ప్రక్రియలో భాగంగా అభివృద్ధి పనులను సమీక్షించారు. పార్కు అభివృద్ధిపై పుష్పనగేష్‌ను అభినందించారు. కాలనీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్, ఈఈ వెంకటరమణ, ఏఈ శివ, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఎంపీపీఎస్ బిలాల్‌పూర్‌లో
# ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



**కోహిర్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** కోహిర్ మండలం బిలాల్‌పూర్ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కే. సురేష్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అండాలు, మృదుల, సింహాచలం, వినోద, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆకునూరులో
# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమిపూజ



**చేర్యాల, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని ఆకునూరు గ్రామ పంచాయతీ రెండో వార్డులో శుక్రవారం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు వార్డు సభ్యురాలు అందె లక్ష్మీ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా డ్రైనేజీ సౌకర్యం లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు సర్పంచ్ కొమ్ము రవి, పాలకవర్గం సహకారంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, వార్డు సభ్యురాలు సూర అనిత, కాలనీవాసులు పాల్గొన్నారు.

## చిట్కుల్ ప్రాథమిక
# పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



**చిలప్‌చేడ్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** చిట్కుల్ ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా ఏఐ ఆధారిత కంప్యూటర్ ల్యాబ్‌ను మండల ప్రత్యేక అధికారి డీపీఎస్ఓ నిత్యానందం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థుల్లో భాషా, గణిత నైపుణ్యాలను పెంపొందించడం అభినందనీయమన్నారు. ప్రాథమిక స్థాయిలోనే కంప్యూటర్ ఆధారిత అభ్యాసం అందించడం వల్ల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఎంఈఓ విఠల్ మాట్లాడుతూ అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులు ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని విద్యా ప్రగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, నాగరాజు, నాగేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, ఉపసర్పంచ్ అఖిల్, పాఠశాల కమిటీ చైర్మన్ పుష్పలత, గ్రామ కార్యదర్శి శోభారాణి, వార్డు సభ్యురాలు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి విద్యాలయంలో
# ఘనంగా బతుకమ్మ సంబరాలు



**కల్హేర్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** కల్హేర్ గ్రామంలోని శ్రీ సాయి విద్యాలయంలో ప్రిన్సిపాల్ పండరి గౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.
విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో పాటలు పాడుతూ ఆటలాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అని తెలిపారు.
భావితరాలకు సాంస్కృతిక విలువలను తెలియజేయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పౌష్టికాహార సందేశంతో బతుకమ్మ సంబరాలు



**బెజ్జంకి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** పాపయ్యపల్లి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు, ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. సర్పంచ్ బొల్లం శ్రీధర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ సూపర్వైజర్ భావన పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్ జమున, గర్భిణులు, తల్లిదండ్రులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## గీతా భూపాల్‌రెడ్డి
# ప్రభుత్వ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**రామచంద్రాపురం, అక్టోబర్ 9 (జనంసాక్షి):** గీతా భూపాల్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. భారతినగర్ మాజీ కార్పొరేటర్ వి. సింధు ఆదర్శ్‌రెడ్డి విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలతో వేడుకలు జరుపుకున్నారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని సింధు ఆదర్శ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పుష్పనగేష్ యాదవ్, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతల
# నిర్మాణ పనులు ప్రారంభం

**నిజాంపేట్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** నిజాంపేట్ గ్రామంలో విబి-జి రామ్ జీ పథకంలో భాగంగా గురువారం ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ప్రారంభించారు. పనులను ఎంపీడీవో సంగ్రామ్ పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవడం వల్ల మురుగునీటి నిల్వ తగ్గి, పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు దోహదపడతాయని, గ్రామాల అభివృద్ధికి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సాయిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, మాజీ సర్పంచ్ జగదీశ్వర చారి, టీఏ శివశంకర్, ఎఫ్ఏ నరేందర్, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మైసంపల్లి పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



నంగునూర్, అక్టోబర్ 9 (జనంసాక్షి): మైసంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్ర వారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ సోమి రెడ్డి నరేష్ రెడ్డి ముఖ్య అతిథి గా హాజరై, తన సొంత ఖర్చులతో విద్యార్థులకు చికెన్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, ఆనందం కోసం సర్పంచ్‌గా పదవిలో ఉన్నంతకాలం ప్రతి నెలా ఒక రోజు ప్రత్యేక భోజనం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నందికందిలో ఘనంగా సేవా సంకల్ప్ అభియాన్

- బిజెపి మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు



సదాశివపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా నందికంది గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు కర్ణం ఆదిత్య, యువమోర్చా అధ్యక్షుడు కాశీనాథ్ ఆధ్వర్యం లో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి శిబిరాన్ని ప్రారంభించి, దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమమే సేవా సంకల్ప్ అభియాన్ లక్ష్యమని తెలిపారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే వికసిత్ భారత్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

## పత్తి పంటకు పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలి



కంగ్టి, అక్టోబర్ 9 (జనంసాక్షి): వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి నేపథ్యంలో పత్తి పంటను కాపాడేందుకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ సూచిం చారు. భీమ్రా గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, 100 రోజుల పత్తి పంటలో కాయలు రాల కుండా, అభివృద్ధి చెందేందుకు పొటాషియం నైట్రేట్ (13-0-45) పిచికారీ చేయాలని తెలిపారు. దీనివల్ల కాయల పరిమాణం, దూది బరువు పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



కోహెడ, అక్టోబర్ 9 (జనంసాక్షి): కోహెడ ప్రభుత్వ జూని యర్ కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరా లను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధి కారి, కళాశాల ప్రిన్సిపాల్ కలకొండ రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రకృతిని పూజించే గొప్ప సంప్రదాయమని వివరించారు. విద్యార్థినులు పాటలు, ఆటలతో వేడుకలను అలరించారు. కార్యక్ర మంలో ఉపసర్పంచ్ కందాల వెంకటేశం, వార్డు సభ్యులు, అధ్యాప కులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటి కొరతతో ట్యాంకర్లకు పెరిగిన డిమాండ్

- తక్కువ బడ్జెట్‌లో నాణ్యమైన ట్యాంకర్ల తయారీకి ప్రాధాన్యం
- డిమాండ్‌కు అనుగుణంగా గుమ్మడిదలలో మరో తయారీ ప్లాంట్
- రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాల అందజేత





గుమ్మడిదల, అక్టోబర్ 9 (జనంసాక్షి): వర్షాలు ఆశించినస్థాయిలో కురవకపోవడం, ఎండల తీవ్రత కొనసాగుతుండటంతో నీటి అవసరాలు పెరుగుతున్నాయి. తాగునీరు, గృహ అవసరాలు, పరి శ్రమలు, నిర్మాణ రంగం, వ్యవసాయానికి నీటి విని యోగం అధికం కావడంతో నీటి ట్యాంకర్లకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. దీంతో ట్యాం కర్ల తయారీ రంగానికి కొత్త అవకాశాలు ఏర్పడు తున్నాయి. గుమ్మడిదల మండలం బొంతపల్లిలోని సాయి తిరుమల ఇంజినీరింగ్ వర్క్స్ నీటి ట్యాంకర్ల తయారీలో ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా ముందుకు సాగుతోంది. పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల ఆర్థిక స్తోమత కు అనుగుణంగా తక్కువ ధరలో నాణ్యమైన, మన్ని కైన ట్యాంకర్లను తయారు చేస్తున్నట్లు సంస్థ యజ మాని ప్రకాశ్ తెలిపారు.

**ఆర్డర్లకు అనుగుణంగా తయారీ...**

నీటి కొరత కారణంగా వివిధ ప్రాంతాల నుంచి ట్యాంకర్లకు ఆర్డర్లు పెరుగు తున్నాయని ప్రకాశ్ పేర్కొన్నారు. వినియోగదారుల అవసరాలకు అను గుణంగా వివిధ పరిమాణాల్లో ట్యాంకర్ల ను తయారుచేసి అందిస్తున్నామని తెలి పారు. నాణ్యత విషయంలో రాజీ పడ కుండా అందుబాటు ధరలకు ఉత్పత్తులను అందించ డమే తమ లక్ష్యమన్నారు.

**గుమ్మడిదలలో మరో ప్లాంట్...**

పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు గుమ్మడిదలలో మరో తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకాశ్ వెల్లడించారు. కొత్త ప్లాంట్ అందుబాటులోకి వస్తే ఎక్కువ సంఖ్యలో ట్యాంకర్లను తయారు చేసి విని యోగదారులకు త్వరగా అందించవచ్చన్నారు. తయా రీ రంగం విస్తరణతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

**రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు...**

నీటి ట్యాంకర్ల తయారీతో పాటు రైతులకు ఉప యోగపడే వివిధ వ్యవసాయ పరికరాలను కూడా తయారు చేసి సబ్సిడీపై అందిస్తున్నామని ప్రకాశ్ తెలిపారు. రైతులకు నాణ్యమైన పరికరాలను అందు బాటు ధరల్లో అందించడం ద్వారా వ్యవసాయ పను ల్లో సమయం, శ్రమ తగ్గించేందుకు సహకరిస్తున్నా మని పేర్కొన్నారు.

**నాణ్యతే లక్ష్యంగా...**

రానున్న రోజుల్లో నీటి ట్యాంకర్లకు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా నాణ్య త, మన్నిక, ధరలకు ప్రాధాన్యమిస్తూ ఉత్పత్తులను అందిస్తున్నామని చెప్పారు. తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచి స్థానిక అవసరాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఆర్డర్లను సకాలంలో పూర్తి చేసేలా సంస్థను విస్తరించనున్నట్లు వెల్లడించారు.

## బాచేపల్లిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



నిజాంపేట్, అక్టోబర్ 9 (జనంసాక్షి): నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని లిటిల్ ఫ్లవర్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. బతుకమ్మ పండుగ ప్రాముఖ్యత, దసరా విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పూలతో ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ అని తెలిపారు.

## మాచిరెడ్డిపల్లి పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



సదాశివపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి): మాచిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠ శాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మోహన్ గౌడ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయు లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు...

పెద్ద శంకరంపేట్, అక్టోబర్ 9 (జనంసాక్షి): పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు. ఆయా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో అంగన్వాడి కేంద్రాల్లో శు క్రవారం విద్యార్థులు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపు కున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను సాంప్రదాయబద్ధంగా పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

### ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు సమాచార హక్కు చట్టం కీలకం



కోహీర్, అక్టోబర్ 9 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల కేంద్రంలోని తహ సీల్దార్ కార్యాలయంలో గురువారం సమా చార హక్కు చట్టం-2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుప్రియ పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకతను పెంపొం దించడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ కార్య కలాపాలపై అవగాహన కల్పించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషి స్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, పరిపాలనా ప్రక్రియలు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై నిబంధనలకు అనుగుణంగా సమాచారాన్ని పొందేందుకు ఈ చట్టం అవకాశం కల్పిస్తుం దని వివరించారు. ప్రజలు తమ హక్కులపై అవగాహన పెం పొందించుకుని ప్రభుత్వ సేవలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. సమా చారాన్ని పొందేందుకు దరఖాస్తు చేసే విధా నం, చట్టంలోని నిబంధనలు, అధికారుల బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ మల్ల య్య, జూనియర్ అసిస్టెంట్లు చరణ్, నాగ రాణి, శోభరాణి, ధనరాజ్, వాలిద్దీన్, గ్రామ పాలనా అధికారులు ఖదీర్, యాదగిరి, శ్రీని వాస్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యులు విధులు సమర్థవంతంగా నిర్వహించాలి



నంగునూరు, అక్టోబర్ 9 (జనంసాక్షి): వార్డు సభ్యులు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐదు రోజుల శిక్షణ ముగియడంతో వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి ఏడేళ్ల జైలు శిక్ష

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 9 (జనంసాక్షి): వరకట్న వేధింపులతో యువతి మృతి చెందిన కేసులో భర్త, మామ, అత్తకు సంగారెడ్డిలోని నాలుగో అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. జహీరాబాద్ ఎన్‌జీటీ కాలనీలో 2022 ఫిబ్రవరి 15న పసుల నికిత (19) ఉరివేసుకుని మృతి చెందింది. అదనపు కట్నం కోసం భర్త సాయికుమార్, మామ యాదప్ప, అత్త అనసూయ వేధించినట్లు మృతురాలి తల్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఎం. సతీష్ కుమార్ శిక్ష విధించారు. సమర్థవంతంగా దర్యాప్తు చేసిన పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

# వర్షాభావంపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి

- పంట నష్టాలు, భూగర్భ జలాలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 9 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడుతున్న వర్షాభావ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పంట నష్టాలు, వర్షపాతం లోటు, భూగర్భ జలాల లభ్యత, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం నిర్వహించిన దృశ్యమాధ్యమ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, భూగర్భ జలమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇంకుడు గుంతలు, వ్యవసాయ కుంటల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, బోరుబావుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాబోయే యాసంగి పంటల సాగులో నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా



వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ ఉప కలెక్టర్ ఉమా హారతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బోగస్ సర్వేలు నిలిపివేయాలి

శివ్వంపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి): సికింద్లాపూర్ గ్రామంలో 285 సర్వే నంబర్‌లో మూడు ఎకరాల భూమిని కొనుగోలు చేశామని రైతులు పావని, ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఐదేళ్ల తర్వాత 288 సర్వే నంబర్ వివాదాన్ని తెరపైకి తెచ్చి గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. పట్టాదారులకు నోటీసులు ఇవ్వకుండా గత నెల 26న సర్వే చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి బోగస్ సర్వేలు నిలిపివేయాలని, పట్టాదారుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని కోరారు.



## గీతా జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



తూప్రాన్, అక్టోబర్ 9 (జనంసాక్షి): తూప్రాన్ గీతా జూనియర్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రామాంజనేయులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా, మహిళల ఐక్యతకు ఆనందాలకు నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చైర్పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు భరత్, డాక్టర్ మౌనిక, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీసు ఉద్యోగాల అర్హతలకై నేడు పరీక్ష

- జహీరాబాద్ ప్రభుత్వ కళాశాలలో కొనసాగుతున్న పరీక్షలు
- ఉదయం 9 గంటలకే హాజరవ్వాలని ఎస్సై సూచన





న్యాల్‌కల్, అక్టోబర్ 09 (జనంసాక్షి): ఈ నెల10, శనివారం ఉదయం10 గంటలకు జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. పోలీస్ (ఎస్సై, కానిస్టేబుల్) ఉద్యోగాల అర్హతలకై దరఖాస్తు చేసుకున్న మండలానికి చెందిన అభ్యర్థులు ఉదయం 9 గంటల్లోపు పరీక్ష కేంద్రానికి విధిగా హాజరవ్వాలని మండలంలోని హద్నూర్ ఎస్సై సుజిత్ సూచించారు. ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్క్రీనింగ్ టెస్ట్ (అర్హత పరీక్ష) కొనసాగనుంది. పరీక్ష వ్రాసే అభ్యర్థులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, దరఖాస్తు చేసుకున్న పత్రాన్ని తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రంలో చరవాణి (సెల్ ఫోన్) స్మార్ట్ వాచ్ (చేతి గడియారం), తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రంలో నిషేధమన్నారు.

## ఘనంగా సుహాసిని రెడ్డి జన్మదిన వేడుకలు



శివ్వంపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి): మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సుహాసిని రెడ్డి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని గంగాధర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరెంటు కోతలు..కర్షకులకు కష్టాలు: భాజపా



పాపన్నపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని భాజపా మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ విమర్శించారు. శుక్రవారం పాపన్నపేట నార్సింగి విద్యుత్ కార్యాలయం ఎదుట భాజపా నాయకులు, రైతులు రహదారిపై నిరసన తెలిపారు. విద్యుత్ అంతరాయంతో పల్లెల్లో వరి పంటలకు నీటి సరఫరా సరిగా జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాములు, దుర్గాప్రసాద్, చంద్రయ్య, కిష్టయ్య,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన





కొల్చారం, అక్టోబర్ 9 (జనంసాక్షి): కొల్చారం, అంశానిపల్లి గ్రామాల్లో శుక్రవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంటలు పండించి అధిక నికర ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి తెలిపారు. జీవామృతం, ఘన జీవామృతం, వేప కషాయం వినియోగంతో పాటు పంటల మార్పిడి, అంతర పంటల సాగు, సహజ సస్యరక్షణ పద్ధతులను వివరించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, నేల సారాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు.

## రంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన డీఎల్పీఓ



కొల్చారం, అక్టోబర్ 9 (జనంసాక్షి): కొల్చారం మండలం రంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని డీఎల్పీఓ సుదర్శన్ శుక్రవారం సందర్శించారు. కార్యాలయంలో రికార్డులు, పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిట్కుల్ సురేష్, మాజీ సర్పంచ్ విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకట రాములు, ప్రశాంత్ పాల్గొన్నారు.

## ప్రెజెంటేషన్ హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



చేర్యాల, అక్టోబర్ 9 (జనంసాక్షి): ప్రెజెంటేషన్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ రెవ. సిస్టర్ జ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సాంస్కృతిక నృత్యాలు, నాటికలు ప్రదర్శించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల గొప్పతనాన్ని వివరిస్తూ చేసిన ఉపన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సిస్టర్ జ్యోతి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. ఈ వేడుకలతో విద్యార్థుల్లో సంప్రదాయాలపై గౌరవం, ఐకమత్య భావన పెంపొందాయని పేర్కొన్నారు.

## లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

నిజాంపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి): మండలంలోని బాచేపల్లి లిటిల్ ఫ్లవర్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యత, దసరా విశిష్టతను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పూలతో ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ అని తెలిపారు. విద్యార్థులకు పండుగ విశిష్టతను తెలియజేశారు.

## గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం

- చేర్యాల ఎంపీడీవో అనభేరి ప్రణయ్
- వార్డు సభ్యులకు సర్టిఫికెట్ ల ప్రదానం



చేర్యాల, అక్టోబర్ 09(జనంసాక్షి): గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని చేర్యాల ఎంపీడీవో అనభేరి ప్రణయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముస్త్యాల గ్రామ రైతు వేదికలో జరిగిన వార్డు సభ్యుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఐదు రోజులు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే గ్రామస్థాయి నుంచి అభివృద్ధి జరుగుతుందని అన్నారు. గ్రామంలోని వార్డుల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు కార్యదర్శి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## చింతలగట్టు పాఠశాల, అంగన్‌వాడీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



కోహీర్, అక్టోబర్ 9 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం చింతలగట్టు గ్రామంలోని యూపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో దాని ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారుల్లో సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడం, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల కేరింతలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

**రాజాపూర్, అక్టోబర్ 9(జనంసాక్షి):** రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామంలో ఎస్ జీ ఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ -19 వాలీబాల్ టోర్నమెంట్‌ను రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల బాలికలు, బాలురు పాల్గొని వాలీబాల్ ను ఆడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, రాష్ట్ర క్రీడల అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, మండల ప్రత్యేక అధికారి రాధరోహిణి, సర్పంచ్ రేవతి, తహసీల్దార్ రాధాకృష్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఇఓ సుధాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, రంగారెడ్డిగూడ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఓటు చోరీకి పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..
- రాహుల్ గాంధీకి మద్దతుగా జగ్గారెడ్డి 'సేవ్ అవర్ ఓట్స్' కార్యక్రమం

**సంగారెడ్డి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని మందిర్ టెంపుల్ వద్ద 'సేవ్ అవర్ ఓట్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్స్‌లో ప్రజలు తమ పేర్లు, పోలింగ్ బూత్ నంబర్లు రాసి, ఓటు హక్కును కాపాడాలని సందేశాలతో వినతులు సమర్పించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడి గొంతుక అని, దానిని పరిరక్షించుకోవడం ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంతో సమానమని అన్నారు. ఓటు హక్కుల పరిరక్షణ




కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి సంగారెడ్డి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల నుంచి సేకరించిన ఓటు కార్డులను రాష్ట్రపతికి పంపిస్తానని తెలిపారు. తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో 73 లక్షల ఓట్లు తొలగించారని, 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇచ్చారని జగ్గారెడ్డి ఆరోపించారు. ఓట్ల చోరీ కారణంగానే బీజేపీ ఎంపీలు గెలుస్తున్నారని, వారి మద్దతుతో మోదీ ప్రధాని అవుతున్నారని విమర్శించారు. మోదీ, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజల ఓటు




హక్కును హరిస్తున్నారని ఆరోపిస్తూ, జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా సంగారెడ్డిలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని రాహుల్ గాంధీ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత కిషన్, రామ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ జార్జ్, కూన సంతోష్, కిరణ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి

### నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవు: కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక అధికారులతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై ఇంకా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వారికి అవగాహన కల్పించి వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. బేస్‌మెంట్, రూఫ్ లెవల్, రూఫ్ కాస్టింగ్ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారుల జాబితా ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

దసరా తర్వాత జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగి సీజన్‌లో పంటలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశమున్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని తెలిపారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీటిని వృథా చేయకుండా ప్రజలకు సూచనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వీజీ రామ్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీల సంఖ్యను పెంచి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## శిశుమందిర్‌లో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం



**పెద్దశంకరంపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి):** పెద్దశంకరంపేట శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలికా విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మాతృమండలి సంయోజకురాలు గాండ్ల అనిత మాట్లాడుతూ బాలికల విద్య సమాజ అభివృద్ధికి, దేశ ఆర్థిక ప్రగతికి కీలకమని తెలిపారు. సమానత్వం, సాధికారత, ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సుపై వివరించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు లక్ష్మీనారాయణ, మాతృమండలి సభ్యులు, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## D6 కెనాల్ చివరి ఆయకట్టును సందర్శించిన బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి



**ఆత్మకూర్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ఆత్మకూరు మండలంలో రేచింతల గ్రామంలో D6 కెనాల్ చివరి ఆయకట్టును మక్తల్ నియోజకవర్గ MLC ఇంచార్జి డాక్టర్ బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. రైతులు పండించిన పంటలు నీరు లేక ఎండిపోతున్న దృశ్యాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల పేరిట అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే జూరాల నుండి చివరి ఆయకట్టు వరకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అశోక్ భూపాల్, MLC ఎన్నికల సహ ఇంచార్జి జిందే శ్రీనివాస్, రేచింతల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ అంజి ముదిరాజ్, లక్ష్మికాంత్, బలవీర్, మురళి, మహేష్, బీజేపీ బూత్ అధ్యక్షులు, పదాధికారులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేకు శ్రీకారం



**రాజోళి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలో భూముల రీ సర్వే ప్రక్రియను శుక్రవారం తహసీల్దార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో కొనసాగించారు. రీ సర్వేలో భాగంగా తూర్పు గార్లపాడు గ్రామ శివారులోని పంట పొలాలను ఆధునిక సర్వే యంత్రం ద్వారా కొలతలు చేపట్టారు. భూముల హద్దుల గుర్తింపు, భూ వివాదాల నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సర్వే ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిపిఓ సుల్తానా, మండల సర్వేయర్ రామకృష్ణ, రాజు, నాగన్న, చైన్మెన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పూల పండుగతో పులకించిన పాఠశాలలు



**గుండుమాల్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని జెడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్‌తో పాటు పలు పాఠశాలల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దసరా సెలవుల నేపథ్యంలో ఒక రోజు ముందుగా సంబరాలు జరిపారు.

విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలతో సందడి చేశారు. ఎంఈవో శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు.

ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐకమత్యం, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

## ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులందరూ నమోదు చేసుకోవాలి



**మద్దూరు, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ సబ్సిడీలు పొందేందుకు రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆధార్ కార్డు, అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో ఏఈఓ లేదా మీ-సేవ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఒక్కసారి నమోదు పూర్తయితే మళ్లీ అవసరం లేదని తెలిపారు. ఇప్పటికే నమోదైన రైతులు వివరాల్లో మార్పులుంటే నవీకరించుకోవాలన్నారు. దామగన్‌పూర్‌లో డీసీఎస్ సర్వేను పరిశీలించి, అక్టోబర్ 10లోగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

## బావిలో యువతి మృతదేహం

**వడ్డేపల్లి అక్టోబర్ 9(జనంసాక్షి):** వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం యువతి మృతదేహం బావిలో కనిపించడంతో పట్టణంలో కలకలం చెలరేగింది. ఎస్సై నాగ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం స్థానిక జమ్ములమ్మ ఆలయం పక్కన గల బావిలో యువతి మృతదేహం కనిపిస్తుందని సమాచారం తెలపడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు మృతదేహం పై విచారణ చేపట్టగా మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరా నగర్ కు చెందిన అనురాధ (19) గా గుర్తించారు కాగా ఈనెల 6వ తేదీన యువతి కనిపించడం లేదంటూ ఆమె తండ్రి శాంతినగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు ఈ క్రమంలో యువతి శవమయితెలగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

## ఆత్మకూర్ మున్సిపాలిటీలో ఉపాధి పనులు చేపట్టాలి




**ఆత్మకూర్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ఆత్మకూర్ మున్సిపాలిటీలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. అజయ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కమిషనర్ నరేష్ కుమార్, మున్సిపల్ చైర్మన్ నాగమణికి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనంతో ఉపాధి పనులు రద్దై పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలను కరువుగా ప్రకటించాలని, భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12 వేలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు పట్టణాల్లో రోజుకు రూ.400 కూలీతో ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా కూలీలు పాల్గొన్నారు.

# మల్కాపూర్‌లో అక్రమ వెంచర్ల కలకలం!

- అనుమతులపై అనుమానాలు..
- మౌలిక వసతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలా?





**కొండాపూర్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ శివారులో వెంచర్ల ఏర్పాటు, అనుమతులు, మౌలిక వసతుల కల్పనపై వివాదం నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు ఏర్పాటు చేసి, రహదారులు, మురుగునీటి కాలువలు తదితర వసతులు పూర్తికాకముందే ప్లాట్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు మార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు తనిఖీలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**సర్వే నంబర్లలో వెంచర్లు...**

మల్కాపూర్ రెవెన్యూ పరిధిలో ఎక్స్‌రోడ్ నుంచి మల్లేపల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కన సర్వే నంబర్లు 96పీ, 100పీ, 103పీలలో సుమారు 22,280.63 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఒక లేఅవుట్, సర్వే నంబర్ 94లో సుమారు 40,830.9 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మరో వెంచర్ పనులు కొనసాగుతున్నట్లు సమాచారం. వీటికి ప్రాథమిక అనుమతులు ఉన్నట్లు చెబుతున్నప్పటికీ, తుది లేఅవుట్ అనుమతులు ఉన్నాయా, నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**గజం రూ.27 వేల నుంచి రూ.35 వేల వరకు?**

వెంచర్లలో గజం స్థలాన్ని రూ. 27 వేల నుంచి రూ. 35 వేల వరకు విక్రయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేసే ప్రజలకు అనుమతుల వివరాలు స్పష్టంగా తెలియజేయాలని కోరుతున్నారు. రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, పార్కులు, పచ్చదనం వంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించకుండానే విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఫిర్యాదులపై స్పందించాలి...**

సర్వే నంబర్ 94లోని వెంచర్ చుట్టూ రెండు నెలలుగా ప్రహరీ నిర్మాణం కొనసాగుతోందని, దానికి అనుమతులు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. వెంచర్లతోపాటు కొన్ని భవన నిర్మాణాలు కూడా అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, అనుమతులు, లేఅవుట్ నిబంధనలు, మౌలిక వసతులపై వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ రావాల్సి ఉంది.

## టీబీ ముక్త గ్రామ పంచాయతీగా సైదాపూర్ ఎంపిక

- సర్పంచ్ రాధిక రామగౌడ్‌ను అభినందించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** సంగారెడ్డి నియోజకవర్గంలోని సైదాపూర్ గ్రామ పంచాయతీ టీబీ ముక్త గ్రామ పంచాయతీగా ఎంపికైంది. ఈ సందర్భంగా సర్పంచ్ రాధిక రామగౌడ్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను కలవగా, ఆయన ఆమెను అభినందించారు. గ్రామాన్ని టీబీ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన పాలకవర్గం, ఆరోగ్య సిబ్బంది, అధికారులను ప్రశంసించారు. ప్రజారోగ్య పరిరక్షణలో గ్రామ పంచాయతీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. టీబీ లక్షణాలను ప్రారంభ దశలో గుర్తించి, బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. సైదాపూర్ సాధించిన గుర్తింపు ఇతర గ్రామాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

## మల్గిలో త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



**న్యాల్‌కల్, అక్టోబర్ 09 (జనంసాక్షి):** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బావులు, బోరు బావుల్లో నీరు అడుగంటి పోవడం, అరకొరగా మిషన్ భగీరథ నీటి సరఫరా, విద్యుత్ కోతలు, లో ఓల్టేజీ, తదితర సమస్యలతో గ్రామంలోని పలు కాలనీల్లో గత కొంత కాలంగా త్రాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో 4, 5 వార్డుల్లో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు గ్రామ సర్పంచ్ ముల్లావాలే అమినబీ, కార్యదర్శి అనిల్ పాటిల్, ఉప సర్పంచ్ మంగళ, వార్డు సభ్యులు దృష్టి సారించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ నిధులతో.. గురువారం ప్రత్యేకంగా బోర్ బావి తవ్వించారు. కాలనీ వాసులకు సరిపడే విధంగా నీరు రావడంతో బోరు మోటర్ ను ఏర్పాటు చేసి, పైప్ లైన్ ద్వారా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు తరలించి కాలనీ వాసులకు త్రాగు నీటిని సరఫరా చేసి సమస్యను పరిష్కరించారు. ఎట్టకేలకు ఎద్దడి సమస్య పరిష్కారం అవడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో షౌకత్ అలీ, ఇస్మాయిల్ సాబ్, సుమంత్, శివగౌండ, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానం



**న్యాల్‌కల్, అక్టోబర్ 09 (జనంసాక్షి):** రక్తహీనతతో తీవ్ర ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ఎంతో కీలకమని, సేవాదృక్పతతో ప్రతి ఒక్కరూ.. రక్తదానం చేసి ఆదుకోవాలని న్యాల్ కాల్ మండల బాజపా పార్టీ అధ్యక్షుడు గంగువార్ మల్లేష్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ పట్టణంలో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త దానం చేశారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు.. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా.. "సేవా సంకల్ప్ అభియాన్" రక్తదాన శిబిరాన్ని బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, పార్టీ శ్రేణులు జగన్, రాజశేఖర్ రెడ్డి, గొల్ల భాస్కర్, తదితరులు రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రమేష్ రెడ్డి, దుర్గయ్య, సుధీర్ బండారి, శ్రీనివాస్ గౌడ్, నరేష్ దేశ్ పాండే, సోమ అనిల్, నరేష్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆదర్శ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**కోహెడ, అక్టోబర్ 09 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని శ్రీ ఆదర్శ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తీసుకొచ్చిన రకరకాల పువ్వులతో బతుకమ్మలను పేర్చి, తరగతుల వారిగా విద్యార్థినీలు పేర్చిన బతుకమ్మలను తీసుకువచ్చి పాఠశాల మైదానంలో బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. విద్యార్థుల చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శైలజ, కరస్పాండెంట్ అంజయ్య, ఉపాధ్యాయ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు



**మునిపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మునిపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో ముందస్తుగా విద్యార్థులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. శనివారం నుంచి పాఠశాలలకు సెలవులు కావడంతో శుక్రవారం పలు పాఠశాలలో బతుకమ్మలు పేర్చి సంబరాలు నిర్వహించారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలోని యునైటెడ్ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు ముందుగానే బతుకమ్మ సంబరాలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఐదు ఫీట్ల బతుకమ్మను విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారుచేసి ప్రదర్శించారు. విద్యార్థినులు ఆటపాటలతో ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు.

## పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ, దసరా వేడుకలు

**తెలకపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని సిద్ధార్థ మోడల్ స్కూల్, శాంతినికేతన్ విద్యాలయం, ఎస్.ఆర్. పాఠశాలల్లో బతుకమ్మ, దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పూలతో బతుకమ్మలను అలంకరించి, పాటలు, నృత్యాలతో సందడి చేశారు. ఎస్.ఆర్. పాఠశాలలో మహిషాసుర వధ ఘట్టాన్ని నాటకంగా ప్రదర్శించారు. ఉపాధ్యాయులు బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని, దసరా చెడుపై మంచి విజయానికి నిదర్శనమని వివరించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాంపూర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అల్లాదుర్గం, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని రాంపూర్ గ్రామంలో మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, సర్పంచ్ గోపాల్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రేషన్ కార్డుల ద్వారా బియ్యంతోపాటు ఆరోగ్యశ్రీ, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎంపీపీఎస్ బిలాల్‌పూర్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**కోహిర్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని బిలాల్‌పూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ ప్రాముఖ్యత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, సమిష్టి భావన, సంప్రదాయాల పట్ల గౌరవం పెరుగుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కే. సురేష్, ఉపాధ్యాయులు అండాలు, మృదుల, సింహాచలం, వినోద తదితరులు పాల్గొన్నారు.

## భవిత కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**సదాశివపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి):** పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించిన అధ్యాపకులు, విద్యార్థినులు పాటలు పాడుతూ సందడి చేశారు. ప్రిన్సిపాల్ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ప్రజలను ఏకతాటిపైకి తెచ్చే పండుగ అని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజు,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ



**ఆత్మకూర్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** పురపాలక సంఘం ఆత్మకూరు 9వ వార్డులోని ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన 5 మంది అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ శ్రీమతి జి. నాగమణి రాజేష్, వైస్ చైర్మన్ ఎన్. శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ఎ. నరేష్ కుమార్ మరియు 9వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి సద్దల తులసి వెంకట్ రాములు ఆధ్వర్యంలో ఈ ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 9వ వార్డు ఆఫీసర్ డి. మధుబాబు, దయానంద్,అశోక్‌కుమార్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బుర్రకథ కళాకారుడు కన్నుమూత



**అయిజ, అక్టోబర్ 9 (జనంసాక్షి):** అయిజ ప్రముఖ బుర్రకథ కళాకారుడు, తెలంగాణ రత్న అవార్డు గ్రహీత సిటిమిటి ఉల్లిగెన్న (82) కన్నుమూత. అయిజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఉల్లిగెన్న నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించిన మున్సిపల్ కౌన్సిలర్లు. జానపద కళారంగానికి తీరని లోటని చైర్మన్ సీఎం సురేష్ విచారం వ్యక్తం చేశారు.

## కొత్తకోటలో కాన్షీరాం 20వ వర్ధంతి

- **బహుజన రాజ్య సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలి: గౌనికాడి రాములు యాదవ్**



**కొత్తకోట, అక్టోబర్ 9 (జనంసాక్షి):** కొత్తకోట పట్టణ కేంద్రంలో బహుజన ఉద్యమ నేత మాన్యశ్రీ కాన్షీరాం 20వ వర్ధంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఐక్యత కోసం ఆయన చేసిన కృషిని నాయకులు స్మరించుకున్నారు. వనపర్తి జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకుడు గౌనికాడి రాములు యాదవ్ మాట్లాడుతూ, కాన్షీరాం ఆశయాలను ఆదర్శంగా తీసుకొని బహుజన రాజ్య సాధనకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలు రాజకీయ చైతన్యంతో ముందుకు సాగాలని, ఎన్నికల్లో ఓటు హక్కును స్వతంత్రంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు నత్తి సుధాకర్ మహారాజుతో పాటు పలువురు బహుజన సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా బాలికల జట్టు




**నారాయణపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు నారాయణపేట జిల్లా జట్టు శుక్రవారం బయలుదేరింది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నార వెంకటప్ప తెలిపారు. ఉపాధ్యక్షుడు బొంత నరసింహులు, కోశాధికారి కార్తీక్ క్రీడాకారిణులకు క్రీడా దుస్తులు అందించి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

## పి.ఎం.శ్రీ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



**మల్దకల్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మల్దకల్ పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జి. సురేష్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. విద్యార్థులు మన సంస్కృతిని గౌరవించి భావితరాలకు అందించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు ఐక్యత, సృజనాత్మకతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు జాబితా తయారీ పకడ్బందీగా చేపట్టాలి

### నవంబర్ 6లోగా ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేయాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 9 (జనంసాక్షి):** రానున్న మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటరు జాబితా తయారీ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. అర్హులైన పట్టభద్రులందరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు జాబితా తయారీపై సమీక్షించారు. ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ, అర్హతల పరిశీలన, ముసాయిదా జాబితా రూపకల్పన, తుది జాబితా ప్రచురణకు సంబంధించిన షెడ్యూల్‌పై సూచనలు చేశారు. ఈ సమావేశానికి వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం-18 దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6 చివరి తేదీ కావడంతో పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. దరఖాస్తుల్లోని వివరాలు, సంబంధిత ధ్రువపత్రాలను ఎన్నికల నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.

నవంబర్ 25న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించాలని, అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. అనుబంధ జాబితాల తయారీ, ముద్రణ ప్రక్రియను డిసెంబర్ 25లోగా పూర్తి చేసి, డిసెంబర్ 30న తుది ఓటరు




జాబితా ప్రచురణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఓటరు జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ చిన్నారుల బతుకమ్మ సంబరాలు



**అచ్చంపేట, అక్టోబర్ 8 (జనంసాక్షి):** అచ్చంపేట మున్సిపల్ కేంద్రంలోని 17వ వార్డు 10వ అంగన్వాడీ కేంద్రంలో దసరా ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని చిన్నారులు బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా నిర్వహించారు. కూరగాయలతో బతుకమ్మను ఏర్పాటు చేసి ఆటపాటలతో సందడి చేశారు.

ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ సంధ్య మాట్లాడుతూ పోషణ మాసంలో భాగంగా ఆకుకూరలు, కూరగాయలను నిత్యాహారంలో చేర్చుకోవాలని సూచించారు. పోషకాహార ప్రాముఖ్యతను వివరించి చిన్నారుల తల్లులకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..



**మహమ్మదాబాద్,అక్టోబర్ 09 (జనంసాక్షి):** పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని,జిపిఓ శ్రీనివాస్ గౌడ్,గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ,రేషన్ డీలర్ శారద,పేర్కొన్నారు.మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ,ఉప సర్పంచ్ హన్మంత్ గౌడ్,పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి,రేషన్ డీలర్ శారద లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడంతోపాటు,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలన్నదే లక్ష్యమని వారు తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో నాయకులు సందోళ్ల చిన్న హన్మయ్య,పారుపల్లి నర్సింలు, అనంతయ్య, రాములు, జీపీ శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు మంగమ్మ,శంకర్ నాయక్‌తోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి

- **మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి**

**మక్తల్, అక్టోబర్ 09 (జనంసాక్షి):** మక్తల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నివాసంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల వేళ ప్రతి ఒక్క పట్టభద్రుడిని (గ్రాడ్యుయేట్) వ్యక్తిగతంగా కలవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇంజనీర్లను కలిసి మాట్లాడాలని సూచించారు. ఏ ఒక్క పట్టభద్రుడిని కూడా నిర్లక్ష్యం చేయకుండా ఓటర్ల నమోదు, పార్టీ మద్దతుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తూ ఏకంగా 2,70,000 (రెండు లక్షల డెబ్బై వేల) ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన చారిత్రాత్మక విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యువతకు, ఉద్యోగులకు చేసిన మేలును



ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయాల సిరులతో..బతుకమ్మ సంబరాలు!

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: సర్పంచ్ నవనీత చెన్నయ్య**



**గండీడ్ అక్టోబర్ 09 (జనంసాక్షి):** పూల పండుగ బతుకమ్మ వేడుకలను వెన్నచేడ్,పీఎం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. గండెడు మండల పరిధిలోని, వెన్నచెడు గ్రామంలోని,తీరొక్కపూలతో అలంకరించిన బతుకమ్మల పండగ వేడుకలను,పీఎం పాఠశాల విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సర్పంచ్,గుర్రాల నవనీత చెన్నయ్య,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంత లక్ష్మారెడ్డి హాజరయ్యారు.ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..బతుకమ్మ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అని,ప్రకృతిని ఆరాధించే ఈపండుగ విశిష్టతను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవిబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ పుష్పలత గోపాల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రకృతి పూల తోరణం.. సంస్కృతి వైభవ శోభితం

- **ఎంగిలిపూల బతుకమ్మతో పండుగ సంబరాలు ప్రారంభం**

**జడ్చర్ల, అక్టోబర్ 9 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. భాద్రపద అమావాస్యను పురస్కరించుకుని తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో మొదలయ్యే తొమ్మిది రోజుల ఉత్సవాలకు జడ్చర్ల పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామాలు సిద్ధమయ్యాయి.

**ప్రకృతి పూలతో బతుకమ్మ అలంకరణ...**

వర్షాకాలం ముగిసి ప్రకృతి పచ్చదనంతో కళకళలాడే సమయంలో జరుపుకునే బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధనకు ప్రతీక. గునుగు, తంగేడు, చామంతి, బంతి, గుమ్మడి, పట్టుకుచ్చు తదితర రంగు రంగుల పూలను సేకరించి తాంబాలంలో గోపురాకారంలో బతుకమ్మను పేర్చుతారు. పైభాగంలో పసుపుతో చేసిన గౌరమ్మను ప్రతిష్ఠించి మహిళలు, ఆడపడుచులు ఒకచోట చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆడిపాడుతారు. అనంతరం చెరువులు, కాలువలు, జలాశయాల్లో బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు.

**ఎంగిలిపూల బతుకమ్మ ప్రత్యేకత...**

తొలిరోజు వేడుకకు ప్రత్యేక ఆధ్యాత్మిక, సంప్రదాయ ప్రాధాన్యత



ఉంది. పండుగకు ముందు రోజు పురుషులు, సోదరులు అడవులు, పొలాల నుంచి వివిధ రకాల పూలను సేకరించి నీటిలో ఉంచుతారు. మరుసటి రోజు ఆ పూలతో బతుకమ్మను పేర్చడం వల్ల దీనికి ఎంగిలిపూల బతుకమ్మ అనే పేరు వచ్చింది. తొలి రోజు నువ్వులు, బియ్యప్పిండి, రవ్వ, బెల్లం లేదా చక్కెరతో తయారు చేసిన ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. పుట్టింటికి చేరుకునే ఆడపడుచులు, బంధుమిత్రులు కలిసి ఆనందంగా వేడుకల్లో పాల్గొంటారు. మహిళల ఐక్యత, కుటుంబ అనుబంధాలు, ప్రకృతి పట్ల గౌరవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి పరిచయం చేస్తోంది.

# ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ: జయలక్ష్మి

**గద్వాల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా, ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే పండుగగా బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు ఉందని గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ బి.ఎస్. జయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతితో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థినులు వివిధ రకాల ప్రకృతి సిద్ధమైన రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లతో పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.

**ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ...** ప్రకృతిని, ఆడపడుచులను గౌరవిస్తూ జరుపుకునే ప్రత్యేక పండుగ బతుకమ్మ అని కొనియాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు.



బండ్ల జ్యోతి మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు భావితరాలకు సంప్రదాయాలను పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థినులు చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు బతుకమ్మ పండుగ విశిష్టతతోపాటు పూల ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలను విద్యార్థినులకు వివరించారు. సంప్రదాయ పాటలతో వేడుకలు ఆనందంగా సాగాయి.

# విద్యుత్ కోతలతో రైతన్నలు విలవిల



- **కాంగ్రెస్ హామీలు అమలు చేయడంలో విఫలం**

**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** రాష్ట్రంలో విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్ విమర్శించారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఐదు నుంచి ఆరు గంటలు కూడా సక్రమంగా సరఫరా చేయలేకపోతోందని ఆరోపించారు. విద్యుత్ కోతలతో పంటలకు నీరందక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పెరిగిన సాగు ఖర్చులకు తోడు కరెంట్ సమస్యలు భారంగా మారాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రైతుల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుకు గడువు నవంబర్ 6

- **అర్హులైన వారంతా పేర్లు నమోదు చేసుకోవాలి**



**కల్వకుర్తి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదుకు అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ సూచించారు. ప్రజాస్వామ్యంలో పట్టభద్రుల ఓటు హక్కు కీలకమని పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. ఆధార్ కార్డు, డిగ్రీ ధ్రువపత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటో, మొబైల్ నంబరు అవసరమన్నారు. నవంబర్ 6, 2026లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో https://ceotserms2.telangana.gov.in/MLC/Form18.aspx వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

# మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తప్పవు

**డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురు గుర్తింపు.. ఫిట్‌నెస్ లేని రెండు వాహనాలు పట్టివేత**



**గద్వాల, అక్టోబర్ 9 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా గద్వాల పట్టణంలోని రైల్వే స్టేషన్ మార్గంలో ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని గుర్తించారు. సరైన ఫిట్‌నెస్ లేని రెండు వాహనాలను కూడా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా బాలచంద్రుడు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పట్టాభూమిలో అక్రమ తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదు...



**బిజినేపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండల పరిధిలోని వట్టెం గ్రామ శివారులో గల 123 సర్వేనెంబర్‌లో కల్వకుంట్ల తండాకు చెందిన లక్ష్మణ్ నాయక్. శత్రు నాయక్‌కు సంబంధించిన పట్టా పొలంలోకల్వకుంట్ల తాండాకు చెందిన రాజు నాయక్. రవి నాయక్‌లు కలిసి రాత్రికి రాత్రే లక్ష్మణ్ నాయక్, శత్రు నాయకులకు సంబంధించిన పట్టా పొలంలోని అక్రమంగా మట్టిని తరలించారని వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం నాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు ఇట్టి ఫిర్యాదు పై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్సై శంషుద్దీన్ తెలిపారు.

# ప్రపంచ విప్లవ ధ్రువతార చేగువేరా



**వనపర్తి రూరల్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ప్రపంచ విప్లవ ధ్రువతార చేగువేరా అని సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, కవి జనజ్వాల అన్నారు. గురువారం వనపర్తి సీపీఐ జిల్లా కార్యాలయంలో చేగువేరా 59వ వర్ధంతిని నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, సమసమాజ స్థాపన కోసం ఆయన చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. యువత చేగువేరా ఆశయాలకు అనుగుణంగా అంతరాలు లేని సోషలిస్టు సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు విప్లవ గీతాలు ఆలపించారు.

# విద్యుత్ షాక్ మృతుడి కుటుంబానికి నాయకుల భరోసా

- **సర్పంచ్ చింతోజ్ వెంకటేష్ రూ.50 వేల ఆర్థిక సాయం..**
- **తక్షణ సాయం అందించిన పంచాయతీ కార్యదర్శి**

**ఉప్పునుంతల (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం వెల్టూరు గ్రామంలో విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు ఎడ్ల నిరంజన్ (40) కుటుంబానికి గ్రామ నాయకులు అండగా నిలిచారు. నిరంజన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు ఆర్థిక సాయం అందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామ పంచాయతీలో కార్మికుడిగా సేవలందిస్తున్న నిరంజన్ అకస్మాత్తుగా మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఈ ఘటనతో ఆయన కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

**రూ.50 వేల వ్యక్తిగత ఆర్థిక సాయం...**

గ్రామ సర్పంచ్ చింతోజ్ వెంకటేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తన వ్యక్తిగతంగా రూ.50 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. గ్రామ పంచాయతీలో మంచి కార్మికుడిగా పేరొందిన నిరంజన్ మృతి తీరని లోటని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం అందేలా కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా, గ్రామ పంచాయతీ కార్యదర్శి అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రభుత్వపరంగా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు.

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: కాంగ్రెస్ నాయకులు...**

డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు



ఉప్పునుంతల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నె లక్ష్మీనారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ఇతర కార్యక్రమాలతో అందుబాటులో లేకపోవడంతో ఆయనతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యుత్ శాఖ ద్వారా బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సైతం ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలవాలని అధికారులకు, పార్టీ నాయకులకు సూచించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బాధిత కుటుంబానికి భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పలువురు నాయకులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండెమోని లింగమయ్య, బూసిరాజు మల్లయ్య, గ్రామ సర్పంచ్ చింతోజ్ వెంకటేష్, గ్రామ కార్యదర్శి, గుండమ్మోని శ్రీశైలం,రాజమౌళి, సోషల్ మీడియా ప్రతినిధి శ్రీహరి, గ్రామ నాయకులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దర్గాలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రార్థనలు



**జడ్చర్ల, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని కర్వగడ్డపల్లి గ్రామంలో శుక్రవారం దర్గాను ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, జడ్చర్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల మధ్య మతసామరస్యం, సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, దర్గా కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ ప్రియాంక**

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 9 (జనంసాక్షి):** జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల వద్ద అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పత్తి కొనుగోళ్ల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో కొనుగోళ్ల సమయంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి విక్రయానికి వచ్చే రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా కొనుగోలు కేంద్రాలు, జిన్నింగ్ మిల్లుల వద్ద తగిన సదుపాయాలు కల్పించాలన్నారు.

యాప్ ద్వారా బుకింగ్ చేసుకునే సమయంలో నిర్ణీత సమయ పరిమితి అమలులో ఉన్నప్పటికీ, పత్తి స్వీకరణ, చెల్లింపుల ప్రక్రియకు అవసరమైన సమయాన్ని పొడిగించే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియను పరిగణనలోకి తీసుకుని కొనుగోళ్లలో సమన్వయం పాటించాలని ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతుల వివరాలు, వ్యవసాయ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, డేటా అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రేషన్, చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. ప్రతి జిన్నింగ్ మిల్లుకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని ఇన్‌చార్జిగా నియమించి రైతులకు సహకారం అందించాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో వివరాలు అందుబాటులో లేకపోయినా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని రిజిస్ట్రేషన్




సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. పత్తి రవాణాలో సమస్యలు తలెత్తకుండా రవాణా శాఖతో పాటు ఇతర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, మార్కెటింగ్ శాఖ అధికారి బాలమణి, సీసీఐ ప్రతినిధులు, ఇతర అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

## ఘనంగా కాన్షీరాం వర్ధంతి కార్యక్రమం



**ఎర్రవల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ఎర్రవల్లి మండల కేంద్రంలో శుక్రవారం బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం 20వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి మాసన్న, జిల్లా అధ్యక్షుడు మణికుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను రాజకీయంగా చైతన్యవంతం చేసి, బహుజనుల సంఖ్యాబలాన్ని రాజకీయ శక్తిగా మలిచిన మహనీయుడు కాన్షీరాం అని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బహుజన రాజ్య సాధన కోసం ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చే బాధ్యత బీఎస్పీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం బడంగ్‌పేట్‌లో నిర్వహించిన కాన్షీరాం వర్ధంతి సభకు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

- **ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి: సీపీఎం**



**మద్దూరు, అక్టోబర్ 9 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు ఉడ్మలగిద్ద గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య డిమాండ్ చేశారు. మద్దూరు, కొత్తపల్లి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. జిల్లాలో సాధారణం కంటే 36 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, సుమారు 80 శాతం పంటలు ఎండిపోయాయని తెలిపారు. రైతుల రుణాలు రద్దు చేసి, కొత్త రుణాలు మంజూరు చేయాలని, ఎకరాకు రూ.50 వేల పరిహారం, రైతుభరోసా నిధులు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

## సృజనాత్మక బతుకమ్మల ప్రదర్శన.. విజేతలకు బహుమతులు



**బిజినేపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** పాలెంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మెంటర్-మెంటీ విద్యార్థులు రంగురంగుల పూలతో రూపొందించిన బతుకమ్మలు ఆకట్టుకున్నాయి. సృజనాత్మకంగా బతుకమ్మలను తయారుచేసిన విజేతలకు ప్రిన్సిపాల్ డా.పి.రాములు బహుమతులు అందజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డా. సి. నాగరాజు, శివ దొడ్ల, డా. కె. సుష్మ సమన్వయంతో నిర్వహించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



**వీపనగండ్ల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ సుదర్శన్ రెడ్డి బాలికల ప్రత్యేక శౌచాలయం, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు ఉచిత షూలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. వసతుల కల్పనకు సహకరించిన ఎస్‌బీఐ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## పూల పండుగ.. బతుకమ్మ సంబురం!

- **శ్రీఅక్షర గ్రామర్ స్కూల్‌లో ముందస్తు వేడుకలు**



**మహమ్మదాబాద్,అక్టోబర్ 09(జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండల పరిధిలోని,దేశయపల్లి గ్రామ పరిధిలో ఉన్న అక్షర గ్రామర్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్కపూలతో బతుకమ్మ పండుగ వేడుకలను,సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రహ్లాద్‌రెడ్డి మాట్లాడుతూ..బతుకమ్మ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అని,వాటిని భావితరాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, కృష్ణయ్య,మొగులయ్య,రాధా,సువర్ణ,అస్మిత,షాజిదా,కృష్ణమ్మ,మనీషా, కవిత,జావిద్,సత్యజి,అర్చన,చెన్నమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- **ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి**



**కొత్తపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకుడు ఉడుములగిద్ద గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజయ్య డిమాండ్ చేశారు. తహసీల్దార్ జయరాములకు వినతిపత్రం అందజేశారు. సాధారణం కంటే 36 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, 80 శాతం పంటలు ఎండిపోయాయని తెలిపారు. బ్యాంకు రుణాలు రద్దు చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని, ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని కోరారు.

## అనాథ పిల్లలకు రూ.50 వేల ఆర్థిక సాయం



**బిజినపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు నిరుపేద పిల్లలకు ఒకటో వార్డు, కాలనీ వాసులు రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. తండ్రి తర్వాత ఇటీవల తల్లి మైబమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు సేకరించిన మొత్తాన్ని బాలిక చదువు కోసం పోస్టాఫీసులో జమ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బెల్లె శివకుమార్, రఘుబాబు, మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విష్ణు హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 9 (జనంసాక్షి):** బిజినపల్లి మండలం నల్లవాగు బస్‌స్టాప్ సమీపంలోని విష్ణు హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రత్యేక పూజలు చేసి, సంప్రదాయ పాటలు పాడుతూ నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిపై ప్రేమ, మహిళల ఐక్యతను చాటుతుందని వివరించారు. విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి




**జడ్చర్ల, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మున్సిపాలిటీలో విలీనమైన కావేరమ్మ పేట, నాగసాల, బురెడ్డిపల్లి, బాదేపల్లి, జయప్రకాష్ నగర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పోలే జగన్ మాట్లాడుతూ గ్రామాల విలీనం వల్ల ఉపాధి కోల్పోయిన పేదలకు ఏటా 200రోజుల పని, రోజు కూలీ రూ. 800, భూమిలేని పేదలకు రూ. 12,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గిరీష్‌కు వినతిపత్రం ఇచ్చారు.కార్యక్రమంలో సాయిలు, యాదయ్య, రామచంద్రమ్మ పాల్గొన్నారు.

## రేవల్లి మండలంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**రేవల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** రేవల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పూజలు చేశారు. తహసీల్దార్ సరస్వతి నైవేద్యం సమర్పించగా, ఎంపీడీవో కీర్తన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పండుగను ఆనందంగా జరుపుకోవాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్. వరప్రసాద్ రావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

# నారాయణపేట చేనేతకు పూర్వ వైభవం తీసుకురావాలి

- 60 మంది చేనేత కార్మికులకు 40 రోజుల ఇకత్ నేత శిక్షణ
- రూ.8 లక్షల నిధులు మంజూరు: కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 9 (జనంసాక్షి):** నారాయణపేట చేనేత వారసత్వాన్ని పరిరక్షించి, చేనేత చీరలకు మార్కెట్‌లో ఆదరణ పెంచడంతో పాటు కార్మికుల ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు. నాబార్డ్ మంజూరు చేసిన రూ.8 లక్షలతో 60 మంది చేనేత కార్మికులకు 40 రోజుల పాటు ఇకత్ నేతలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం పట్టణంలోని మూల హనుమాన్ మందిరం వద్ద గల ఘనశ్యామ్ సరోదే లూమ్స్‌ను సందర్శించిన కలెక్టర్, శిక్షణ కార్యక్రమం అమలుపై సంబంధిత ప్రతినిధులతో చర్చించారు. నారాయణపేట చీరలు సంప్రదాయ నేతపద్ధతికి ప్రసిద్ధి చెందాయని, జీఐ గుర్తింపు కూడా పొందాయని పేర్కొన్నారు. చేనేత రంగంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా మహిళా సమాఖ్య, కలెక్టర్ సహకారంతో సమర్పించిన ప్రతిపాదనకు నాబార్డ్ రూ.8 లక్షలు మంజూరు చేసింది. ఈ శిక్షణలో ఆధునిక నేత పద్ధతులు, నూతన డిజైన్లు, కలంకారి డిజైన్లు, ఉత్పత్తుల నాణ్యత పెంపు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించనున్నారు.

**చిత్రికా ప్రొడ్యూసర్ కంపెనీ సందర్శన...**

అనంతరం ధూల్‌పేట వీధిలోని చిత్రికా ప్రొడ్యూసర్ కంపెనీని కలెక్టర్ సందర్శించి మహిళా చేనేత కార్మికులు తయారు చేస్తున్న చీరలను పరిశీలించారు. రంగులు అద్దడం, నూలు సిద్ధం చేయడం, దారం కండీలు కట్టడం, మగ్గంపై చీర నేయడం వంటి ప్రక్రియలను తెలుసుకున్నారు. చీర తయారీకి పట్టే సమయం, కార్మికుల ఆదాయం, విక్రయాలు, ఎగుమతులు, మార్కెటింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమకు తగిన ఆదాయం రావడం లేదని, కొందరికి చేనేత పింఛన్లు అందడం లేదని కార్మికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి నిబంధనల ప్రకారం పింఛన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శంకర్‌ను ఆదేశించారు. అనంతరం పవర్‌లూమ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం మహేందర్ బాబు, చేనేత జౌళి శాఖ ఏడీ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## కుచినేర్ల పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**కేటీ దొడ్డి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కుచినేర్ల పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మహేష్ మాట్లాడుతూ బతుకమ్మ ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు ప్రతీక అని తెలిపారు. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు వేడుకలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వియత్నాం విద్యా విధానాల అధ్యయనానికి గాజుల వెంకటేష్

- ఉపాధ్యాయుడికి విద్యార్థులు, సహచరుల అభినందనలు



**ఉప్పునుంతల, అక్టోబర్ 9 (జనంసాక్షి):** వియత్నాంలో విద్యా విధానాల అధ్యయనానికి ఎంపికైన ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్‌కు శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపి వీడ్కోలు పలికారు.

**ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ...** వెంకటేష్ ఎంపిక పాఠశాలకు గర్వకారణమన్నారు. ఆయన కృషితో విద్యార్థుల సంఖ్య 25 నుంచి 104కు పెరిగిందని, గత ఎనిమిదేళ్లలో 56 మంది విద్యార్థులు గురుకులాల్లో సీట్లు సాధించారని తెలిపారు. కృత్యాధార బోధన, ఆంగ్ల భాషా నైపుణ్యాలు, గురుకుల ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించారని కొనియాడారు. విదేశీ విద్యా విధానాల అధ్యయన అనుభవాలను విద్యార్థుల అభ్యున్నతికి ఉపయోగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కున్సీ వద్ద కాలువల పూడికతీత పనులు ప్రారంభం



**కృష్ణ, అక్టోబర్ 9 (జనంసాక్షి):** కృష్ణ మండలం కున్సీ గ్రామం వద్ద సాగునీటి కాలువల పూడికతీత పనులను మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి శుక్రవారం ప్రారంభించారు. కున్సీ నుంచి హిందూపూర్, తంగిడి, కుసుమూర్తి, చేగుంట వైపు వెళ్లే కాలువల్లో పనులు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆవిర్భావం సందర్భంగా జెండా ఆవిష్కరణ



**గద్వాల, ఆగస్టు 9 (జనంసాక్షి):** తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆవిర్భావ కార్యక్రమంలో భాగంగా గద్వాల పట్టణంలో అమరుడు పులిమామిడి మద్ది లేటి స్తూపం వద్ద జెండా ఆవిష్కరించి అమరులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర ప్రభాకర్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యంతో తెలంగాణ ప్రజా ఫ్రంట్ అనేక పోరాటాలు చేసిందన్నారు. ప్రస్తుత పాలకులు నిరుద్యోగులు, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అమరుల ఆశయాల సాధనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుభాన్, గోపాల్, నాగన్న, వాల్మీకి, కురువ పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



**మల్దకల్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీలత రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల బతుకమ్మ సంబరాలు నిర్వహించాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను పేర్చి, పూజలు చేసి ఆటపాటలతో సందడి చేశారు.

# 16 గంటల పాటు అరుదైన బ్రెయిన్ బైపాస్ సర్జరీ

- 24 ఏళ్ల యువకుడికి పునర్జన్మ ప్రసాదించిన యశోదా వైద్యులు



**మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ప్రాణాంతకమైన జెయింట్ ఎంసీఏ అన్యూరిజమ్‌తో బాధపడుతున్న 24 ఏళ్ల యువకుడికి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు 16 గంటల పాటు అత్యంత క్లిష్టమైన బ్రెయిన్ బైపాస్ సర్జరీ నిర్వహించి విజయవంతంగా ప్రాణాలు కాపాడారు. శస్త్రచికిత్స అనంతరం యువకుడు ఎలాంటి నర సంబంధిత లోపాలు లేకుండా కోలుకోవడం విశేషం. రెండు నెలలుగా తీవ్ర తలనొప్పితో బాధపడుతున్న యువకుడికి వైద్య పరీక్షలు నిర్వహించగా, మెదడులో జెయింట్ మిడిల్ సెరిబ్రల్ ఆర్టరీ (ఎంసీఏ) అన్యూరిజమ్ ఉన్నట్లు గుర్తించారు. అది ఎప్పుడైనా పగిలి ప్రాణాపాయం కలిగించే ప్రమాదం ఉందని వైద్యులు నిర్ధారించారు. యువకుడికి స్కిజోఫ్రీనియా చరిత్ర కూడా ఉంది.

మెదడుకు రక్తప్రసరణ నిరంతరంగా కొనసాగేందుకు వైద్యులు రెండు ఎస్టీఏ-ఎంసీఏ బైపాస్‌లు ఏర్పాటు చేసి, రెండు జెయింట్ క్లిప్‌ల సహాయంతో అన్యూరిజమ్‌ను రక్తప్రసరణ నుంచి వేరు చేశారు. సుమారు 16 గంటల పాటు సాగిన శస్త్రచికిత్సలో ఐసీజీ యాంజియోగ్రఫీ ద్వారా బైపాస్‌లు సక్రమంగా పనిచేస్తున్నాయని, అన్యూరిజమ్ పూర్తిగా వేరైందని నిర్ధారించారు. ప్రస్తుతం యువకుడు సాధారణ జీవనం సాగిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

సీనియర్ న్యూరో సర్జన్ డా. బి. జయానంద్ సుధీర్ మాట్లాడుతూ, జెయింట్ ఎంసీఏ అన్యూరిజమ్‌ల చికిత్స అత్యంత సవాలుతో కూడుకున్నదని, రెండు బైపాస్‌ల ద్వారా మెదడుకు రక్తప్రసరణను కాపాడుతూ అన్యూరిజమ్‌ను నియంత్రించామని వివరించారు. అసోసియేట్ కన్సల్టెంట్ డా.వంశీ రెడ్డి పరపతి మాట్లాడుతూ, ఇది అత్యంత క్లిష్టమైన సెరెబ్రోవాస్కులర్ శస్త్రచికిత్స అని, అధునాతన మైక్రోసర్జరీతో యువకుడిని ప్రాణాపాయం నుంచి కాపాడగలిగామని తెలిపారు.

## గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ పండుగ సంబరాలు



**గట్టు,అక్టోబర్ 09 (జనంసాక్షి);** గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను విద్యార్థినిలు మహిళా అధ్యాపక బృందం ఘనంగా నిర్వహించడం జరిగింది . బతుకమ్మ పండుగను పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపాల్ పి. మంజుల మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రం యొక్క ప్రత్యేకమైన , ప్రధానమైన సాంస్కృతిక పుష్ప పండుగ అని ప్రకృతిని, పూలను, గౌరీదేవిని ఆరాధిస్తూ మహిళలు ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. ప్రతి సంవత్సరం భద్రపదమాసం అమావాస్య నుండి తొమ్మిది రోజులపాటు ఈ వేడుకలు జరుగుతాయని , తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఈ పండుగకు ప్రాధాన్యత పెరిగిందని , తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పండుగ పాత్ర ఎంతో విశిష్టమైనదని ప్రిన్సిపాల్ విద్యార్థులకు తెలియజేశారు . బతుకమ్మ పండుగ కు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని గుర్తుచేస్తూ వేములవాడ నుండి శివలింగాన్ని పార్వతి నుంచి వేరు చేసి తంజావూర్ కు తరలించి నందుకు తమ దుఃఖాన్ని చోళులకు తెలియజేస్తూ పూలను పర్వతంలో పేర్చి బతుకమ్మను జరపడం ఆనవాయితీగా మార్చుకున్నారని , దాదాపు 1000 సంవత్సరాల నుండి బతుకమ్మను తెలంగాణ వాసులు జరుపుకుంటున్నారని వివరించారు . బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థులకు భక్షాలను అల్పాహారంగా ప్రిన్సిపాల్ ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. మంజుల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె ఎస్ డి రాజు,అధ్యాపకులు శ్రీదేవి నెనావతులాలు, జయరాజ్, రాఘవేంద్ర ,ఆయేషా ,శిరీష ,భరత్ ,మహేష్ ,శేఖర్ ,విష్ణు ,గోపాల్ ,మోహన్ ,నరసింహులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని బతుకమ్మ పండుగ విజయవంతం చేశారు.

# దొంగ ఓట్లను తొలగిస్తుంటే కాంగ్రెస్‌కు ఎందుకు భయం?

- బీజేపీ నాయకుల విమర్శలు



**మక్తల్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ఓటర్ల జాబితా నుంచి బోగస్ ఓట్లను తొలగిస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఎందుకు భయపడుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. బలరాం రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట రాములు ముదిరాజ్ ప్రశ్నించారు. శుక్రవారం మక్తల్‌లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందని, చనిపోయిన వారి పేర్లు, బహుళ చోట్ల ఓటు హక్కు కలిగిన వారి పేర్లు తొలగించడం అవసరమని అన్నారు. మక్తల్ మండలంలోని 39 గ్రామ పంచాయతీల ఓటర్లు పట్టణంలోనూ ఓటు హక్కు కలిగి ఉన్నారని, ఇలాంటి ద్వంద్వ ఓట్లను తొలగించాలా వద్దా అని ప్రశ్నించారు. ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. సమావేశంలో మక్తల్ మండల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, మాగనూరు మండల అధ్యక్షుడు జయానంద్ రెడ్డి, స్వాగతం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన భారీ బండరాళ్లు.. ప్రమాదాల ముప్పు

- ఎస్. ఇటిక్యాల్ శివారులో అనుమతులు లేకుండా తవ్వకాలు?
- రాత్రివేళ బ్లాస్టింగ్‌లతో ప్రజలకు ఇబ్బందులు



**పుల్కల్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని ఎస్. ఇటిక్యాల్ గ్రామ శివారులో వ్యవసాయ భూముల నుంచి జేసీబీలతో భారీ బండరాళ్లను వెలికితీస్తున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రివేళల్లో బండరాళ్లను తొలగించేందుకు బ్లాస్టింగ్‌లు చేయడంతో పెద్ద శబ్దాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెలికితీసిన భారీ బండరాళ్లను రోడ్డు పక్కన నిల్వ చేయడంతో వాహనదారులు, పాదచారులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రాత్రివేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వ్యవసాయ భూముల్లో తవ్వకాలకు అనుమతులు తీసుకున్నారా? నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తవ్వకాలపై విచారణ చేపట్టాలని, రోడ్డు పక్కన ఉన్న బండరాళ్లను తొలగించి ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**అనుమతులు అవసరం లేదంటున్న జీపీఓ?**

వ్యవసాయదారుల పొలాల్లో బండరాళ్లు తొలగించి రోడ్డు పక్కనైనా, మరోచోటైనా వేయవచ్చంటూ ఎస్. ఇటిక్యాల్ జీపీఓ పాషా వ్యాఖ్యానించినట్లు స్థానికులు తెలిపారు. కొందరికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ఆయనపై ఆరోపణలు చేశారు. ప్రభుత్వ అధికారి నిబంధనలపై స్పష్టత ఇవ్వకుండా మాట్లాడటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

## వరిగుంతంలో పంచాయతీ నిధుల ఖర్చుపై దుమారం!

- రూ.13 లక్షల నిధుల వినియోగంపై అనుమానాలు.. గ్రామసభలో సర్పంచ్, కార్యదర్శిని నిలదీత



**కొల్చారం, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామపంచాయతీలో సుమారు రూ.13 లక్షల నిధుల వినియోగంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. గ్రామసభలో సర్పంచ్ పుట్లగళ్ల మోహన్, కార్యదర్శి శ్రీదేవిని గ్రామస్తులు నిలదీస్తూ, ఖర్చుల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులకు పలుమార్లు బిల్లులు నమోదు చేయడం, దోమల నివారణ మందు పిచికారీకి రూ.1.35 లక్షలు, మోటార్ల మరమ్మతులకు లక్ష రూపాయలకు పైగా, మొరం పనులకు రూ.1.35 లక్షలకు పైగా ఖర్చు చూపడంపై ప్రశ్నలు లేవనెత్తారు. నాలుగు స్టార్టర్ డబ్బాల కొనుగోలుకు రూ.30 వేలకు పైగా బిల్లులు నమోదు చేయడంపైనా సందేహాలు వ్యక్తం చేశారు.

పంచాయతీ నిధుల ఖర్చుకు సంబంధించిన బిల్లులు, వోచర్లు, రికార్డులను మండల, జిల్లా అధికారులు సమగ్రంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరారు. అవసరమైతే ప్రత్యేక విచారణ చేపట్టి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆరోపణలపై సర్పంచ్, కార్యదర్శి అధికారిక స్పందన తెలియాల్సి ఉంది. నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయా లేదా అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

## సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు పోరాడుతాం



**సూర్యాపేట (జనంసాక్షి):** బుల్లెట్ ట్రైన్ సాధించుకోవడం అనేది సూర్యాపేట జిల్లా ప్రజల హక్కుగా భావించి ఉద్యమాలను ఉదృతం చేయాల్సిన అవసరం ఉందని పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాసరావు అన్నారు. బుల్లెట్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలలో భాగంగా 57వ రోజు జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటకు మంజూరైన బుల్లెట్ ట్రైన్ సాధించుకునే వరకు ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమాన్ని బాధ్యతగా భావించాలని కోరారు. ఎన్నో ఉద్యమాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న పోరాటపటిమ గల సూర్యాపేట ప్రజలకు బుల్లెట్ ట్రైన్ సాధించుకోవడం పెద్ద పని కాదని అన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ తో ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. ఈ దీక్షలో చలమల్ల నర్సింహ, యేలె సత్యనారాయణ, దూలం నగేష్, యలగందుల సుదర్శన్, చిలువేరు నరసింహారావు, కడారి బిక్షం, పొన్నం వెంకన్న, భీమనపల్లి వెంకటేశ్వర్లు, కనుకుంట్ల శారదా దేవి, మిట్టకోల సతీష్, చిధిరాల శోభారాణి, మిట్టకోల యుగంధర్, బాల్నే క్రాంతి, పోట్ట బత్తుల గోవర్ధన్, రుద్ర నారాయణ, జెల్ల సూర్యనారాయణ, చిలుకమర్రి చంద్రమౌళి, పున్నవెంకన్న, కలకుంట్ల అరుణోదయ సాగర్, రాపోలు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు. పెద్దిరెడ్డి గణేష్, పెద్దిరెడ్డి రాజా, గందూరి శంకర్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, వై వెంకటేశ్వర్లు, తదితరులు సంఘీభావం తెలిపారు.

# అన్ని రంగాల్లో విశ్వఖ్యాతి పొందిన సిద్దిపేట

- నేటి 10కే రన్.. రేపటి పది రెట్ల అభివృద్ధికి బాటలు కావాలి
- సిద్దిపేట జిల్లా, రైలు మార్గం, గోదావరి జలాల కలలు సాకారం: ఎమ్మెల్యే హరీశ్ రావు



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 9 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన 10కే రన్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నేటి పరుగు రేపటి సిద్దిపేట పది రెట్ల అభివృద్ధికి బాటలు వేయాలని ఆకాంక్షించారు.

సిద్దిపేట జిల్లా ఏర్పాటు అనేది దశాబ్దాల కల అని, 30-40 ఏళ్లుగా ఎన్నికల సమయంలో జిల్లా ఏర్పాటు చేస్తామనే నినాదాలు, గోడ రాతలు కనిపించేవని గుర్తుచేశారు. 1983లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సిద్దిపేటకు వచ్చినప్పుడు కేసీఆర్ జిల్లా ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారని తెలిపారు. 2016 అక్టోబర్ 11న కేసీఆర్ ముఖ్యమంత్రిగా సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేసి ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చారని పేర్కొన్నారు.

జిల్లా ఏర్పాటుతో క్రీడా మైదానాలు, స్పోర్ట్స్ క్లబ్బులు, జిల్లా కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయని, విద్యార్థులు పరీక్షలు రాయడానికి, ఉద్యోగులు వివిధ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గాయని హరీశ్ రావు అన్నారు. గత పదేళ్లలో సిద్దిపేట రూపురేఖలు మారాయని, అభివృద్ధి వేగంగా జరిగిందని చెప్పారు.

ఒకప్పుడు సిద్దిపేట జిల్లా కావాలి, రైలు రావాలి, గోదావరి జలాలు రావాలని మూడు ప్రధాన ఆకాంక్షలు ఉండేవని, ప్రస్తుతం ఈ మూడు కలలు సాకారమయ్యాయని తెలిపారు. రంగనాయక సాగర్‌లో గోదావరి జలాలు, సిద్దిపేటకు రైలు మార్గం, కలెక్టర్, పోలీస్ కమిషనర్ కార్యాలయాలు జిల్లాకు గుర్తింపుగా నిలిచాయని వివరించారు.

సిద్దిపేటలో మెడికల్, నర్సింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ తదితర విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయని చెప్పారు. భవిష్యత్తులో సిద్దిపేటలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసుకోవడమే లక్ష్యమని, ఆ దిశగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో సిద్దిపేటను మరింత అభివృద్ధి చేసి యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించాలని ఆకాంక్షించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పుష్కల అవకాశాలు

- పట్టభద్రుల ఓటరు నమోదులో చురుగ్గా పాల్గొనండి: బీఆర్ఎస్ నేతల పిలుపు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత: మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**మహబూబ్‌నగర్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించేందుకు పుష్కల అవకాశాలు ఉన్నాయని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ భవన్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు, ఎన్నికల వ్యూహంపై పార్టీ నాయకులు చర్చించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై యువత, ఉద్యోగులు, నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని విమర్శించారు. ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలు అందడం లేదని ఆరోపించారు. ఈ అంశాలను పట్టభద్రుల దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే గతంలో ఓటు వేసిన పట్టభద్రులు సైతం మళ్లీ కొత్తగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని గుర్తుచేశారు. నవంబర్ 6లోగా అర్హులైన పట్టభద్రులందరినీ గుర్తించి ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. ప్రతి నాయకుడు, కార్యకర్త తమ పరిధిలోని పట్టభద్రులను సంప్రదించి ఓటరు నమోదుతోపాటు పోలింగ్‌లో పాల్గొనేలా కృషి చేయాలని కోరారు.

**రైతుల పక్షాన పోరాడుతాం...**

జిల్లా రైతులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ వారి పక్షాన పోరాటం చేస్తుందని లక్ష్మారెడ్డి తెలిపారు. రైతుల పొలాలకు సాగునీరు అందే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. నీటి కోసం అడిగిన రైతులపై కేసులు నమోదు చేయడం సరికాదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యా నాయక్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# గద్వాలలో ఘనంగా కిసాన్ మేళా

- ప్రకృతి వ్యవసాయం, ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 9 (జనంసాక్షి):** రైతులు ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, ఆత్మ చైర్మన్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. ఆత్మ ఆధ్వర్యంలో గద్వాలలోని కేఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కిసాన్ మేళాలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక, ఉద్యాన శాఖల స్టాళ్లను ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తక్కువ వర్షాలు కురిసినా రైతులు కష్టపడి పంటలు సాగుచేయడం అభినందనీయమన్నారు. డ్రోన్ల వినియోగాన్ని పెంచి, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. యూరియా వినియోగంపై అవగాహనతో జిల్లాలో సుమారు 2,330 టన్నుల యూరియా వినియోగం తగ్గిందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు, పాడి పరిశ్రమను ప్రోత్సహించాలని, గొర్రెలు, మేకల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ...** వ్యవసాయానికి కనీసం 18 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటలు సాగు చేసేలా అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలని సూచించారు. గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత పాడి పరిశ్రమను ప్రోత్సహించాలని, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప నడిగడ్డను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆల్మట్టి నుంచి జూరాలకు మూడు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు సాంకేతికతను సమర్థంగా వినియోగించాలి

- **పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎస్పీ డి. సునిత రెడ్డి**



**వనపర్తి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు వేగవంతం, పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ డి. సునిత రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

ప్రతి ఎఫ్ఐఆర్‌ను ఈ-సాక్ష్య విధానంలో నమోదు చేసి, కేసులకు సంబంధించిన ఆధారాలను నిబంధనల ప్రకారం సేకరించాలని ఆదేశించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) నిబంధనల ప్రకారం 60, 90 రోజుల గడువుతో సంబంధం ఉన్న కేసుల దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్‌లు, జీరో ఎఫ్ఐఆర్‌లపై తక్షణ చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

**సాంకేతికతతో దర్యాప్తు వేగవంతం...**

టీజీ కాప్, హెచ్ఆర్ఎంఎస్, సీఈఐఆర్ పోర్టళ్లను సమర్థంగా వినియోగించుకుంటూ పోలీసు విధులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని ఎస్పీ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను త్వరగా పరిష్కరించాలని, నాట్‌గ్రిడ్ వ్యవస్థను నిబంధనల ప్రకారం ఉపయోగిస్తూ సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం పెంచుకోవాలని ఆదేశించారు.

**పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం...**

డయల్-112 ద్వారా వచ్చే అత్యవసర ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు సకాలంలో సహాయం అందించాలన్నారు. ఈ-పెట్టీ కేసులు, ఐటీ యాక్ట్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, ఇతర పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. చార్జ్‌షీట్ల దాఖలు శాతాన్ని పెంచడంతో పాటు సమన్లు, వారెంట్ల అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు. పోలీసు అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు.

# పరిశ్రమల అనుమతులు సకాలంలో మంజూరు చేయాలి




**నారాయణపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి):** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను నిర్దేశిత గడువులోగా మంజూరు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, టీఎస్-ఐపాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి, తక్షణమే పరిష్కరించాలని సూచించారు. పరిశ్రమల అనుమతుల మంజూరులో అనవసర జాప్యాన్ని నివారించి, దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిశీలించాలని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందేలా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ధ్రువపత్రాల విషయంలో దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించి, నూతన పరిశ్రమలకు సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎంటర్‌ప్రైజెస్‌కు సంబంధించి 16 యూనిట్లు, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్‌కు సంబంధించి 5 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు. పరిశ్రమల అభివృద్ధితో పెట్టుబడులు, స్థానిక ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామలింగేశ్వర్ గౌడ్, డీఆర్‌డీవో వెంకట్ రాములు, ఎల్‌డీఎం సురేష్ ఆత్రేయతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గణేష్‌పూర్‌లో అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలి

- **ఎస్పీకి వినతిపత్రం అందించిన సర్పంచ్ రేవంత్**



**న్యాల్‌కల్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని గణేష్‌పూర్ గ్రామ శివారులో నిమ్జ్ భూములను కబ్జా చేసి అక్రమంగా ఎర్రరాయి తవ్వకాలు చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హుసెల్లి సర్పంచ్ రేవంత్ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను కోరారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నుంచి సుమారు 200 ఎకరాలకు పైగా భూములను సేకరించి, పరిహారం అందించి, చుట్టూ కంచె ఏర్పాటు చేశాయని తెలిపారు. అయినప్పటికీ కొందరు స్థానికులు, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు భూములను ఆక్రమించి మైనింగ్ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. గతంలో డీఎస్పీ పరిశీలించి హెచ్చరించినా తవ్వకాలు ఆగలేదన్నారు. సరిహద్దు గ్రామాల్లో చోరీలు పెరిగి రైతులు నష్టపోతున్నారని వివరించారు. సమస్యలపై ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు.

# చేనేత కార్మికుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం

- **అమరచింతలో మగ్గంపై స్వయంగా చీర నేసిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి, అక్టోబర్ 9 (జనం సాక్షి): జిల్లాలో చేనేత రంగ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలా సహకరిస్తామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హామీ ఇచ్చారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

శుక్రవారం అమరచింత మండలంలోని హ్యాండ్లూమ్ వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని కలెక్టర్ సందర్శించారు. చీరల తయారీ ప్రక్రియను పరిశీలించి, స్వయంగా మగ్గంపై కూర్చొని చీర నేసే విధానాన్ని ప్రయత్నించారు. అనంతరం కార్మికులతో మాట్లాడి చీరల తయారీ దశలు, వారి అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అమరచింత చీరల ప్రత్యేకతపై పరిశ్రమల శాఖ అధికారులను వివరాలు అడిగారు.

ఈ సందర్భంగా కార్మికులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సులభంగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత యూనిట్‌లో ఎండ వేడి నుంచి ఉపశమనం కల్పించేందుకు రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై స్పందించిన కలెక్టర్ రుణాల మంజూరులో కార్మికులకు సహకరించాలని సంబంధిత అధికారులకు సూచిస్తామని తెలిపారు. ప్రొడ్యూసర్ కంపెనీలో సోలార్ వ్యవస్థ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులను ఆదేశించారు. చేనేత రంగాన్ని ప్రోత్సహిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో చేనేత శాఖ ఏడీ ఇందిర, మండల అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# అభయ ప్రదాయిని.. కావేరమ్మపేట శ్రీ బంగారు మైసమ్మ

- **రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు**





**జడ్చర్ల, అక్టోబర్ 9 (జనంసాక్షి):** నమ్మి కొలిచిన భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా, అభయ ప్రదాయినిగా కావేరమ్మపేట శ్రీ బంగారు మైసమ్మ తల్లి విరాజిల్లుతోంది. జడ్చర్ల పురపాలక పరిధిలోని 9వ వార్డు, ఐబి బంగ్లా సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన ఈ ఆలయం, దాతల ఉదారతతో దివ్య క్షేత్రంగా రూపుదిద్దుకుంది. జడ్చర్లతో పాటు పరిసర గ్రామాల భక్తులు నిత్యం అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుంటారు.

**భక్తుల నిండైన విశ్వాసం:**

ప్రతి ఏటా శ్రావణమాసం చివరి ఆదివారం బోనాల మహోత్సవాన్ని ఇక్కడ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మహిళలు బోనాలు, భక్తులు మొక్కుబడులు సమర్పిస్తారు. ఇక్కడ అమ్మవారిని దర్శించుకుంటే సంతానం లేని వారికి సంతాన ప్రాప్తి, వివాహం కాని వారికి కళ్యాణ యోగం, నిరుద్యోగులకు ఉద్యోగ లాభం చేకూరుతుందని భక్తుల బలమైన నమ్మకం. ప్రతి శుక్రవారం అమ్మవారికి ఒడిబియ్యం, చీర సారెతో విశేష పూజలు జరుగుతాయి.

**శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు, ఆహ్వానం:**

శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయ అభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అక్టోబర్ 11 (ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి) నుంచి అక్టోబర్ 20 (విజయదశమి) వరకు నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. భక్తులు, దంపతులు విశేష సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి దివ్యాశీస్సులు పొందాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.

# దసరా కానుకగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



**కల్హేర్ అక్టోబర్ 9(జనంసాక్షి):** లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ ఆధ్వర్యంలో కల్హేర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగను పురస్కరించుకొని దుస్తుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో, పారిశుద్ధ్య నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న విశిష్ట సేవలు వెలకట్టలేనివని, వారి సేవలను గుర్తిస్తూ మానవతా దృక్పథంతో దసరా కానుకగా దుస్తులను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని, వారి సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ సెక్రటరీ మల్లేష్ బల్లేపు, లయన్స్ క్లబ్ సభ్యులు విట్టల్, గ్రామ ఉపసర్పంచ్ మహేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవదాస్, సర్దార్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సమాజ సేవలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ముందుకు సాగుతుందని క్లబ్ సభ్యులు పేర్కొన్నారు.

# గ్రామసభలో సర్పంచ్ మౌనం.. మరో నాయకుడి పెత్తనంపై ఆగ్రహం



**కొల్చారం, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామసభలో సర్పంచ్ పుట్లగళ్ల మోహన్ వ్యవహారశైలిపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సమస్యలపై సర్పంచ్ స్పందించాల్సిన సమయంలో మరో నాయకుడు జోక్యం చేసుకుని మాట్లాడటంపై పలువురు అభ్యంతరం తెలిపారు.

**సర్పంచ్ ఉండగా.. మరో నాయకుడి పెత్తనం ఎందుకు?**

గ్రామంలో ఏ పని చేయాలన్నా సదరు నాయకుడి సలహాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని గ్రామస్తులు ప్రశ్నించారు. సర్పంచ్ మాట్లాడుతున్న సమయంలో మరో నాయకుడు జోక్యం చేసుకోవడం, ఇతరులకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారా, లేక మరో నాయకుడి సూచనల మేరకు పనిచేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

గ్రామసభ ప్రజల సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలు కనుగొనే వేదిక అని, ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలకు సర్పంచ్ బాధ్యతాయుతంగా సమాధానాలు చెప్పాలని కోరారు. ఈ వ్యవహారంపై దండు ప్రశాంత్ తేజ, ఆకుల రాజు, మాజీ ఎంపీటీసీ తుడుము రామకృష్ణ, దండు రాజు తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

# సెల్ టవర్ నిర్మించొద్దు! రోడ్డుపై బైఠాయించిన స్థానికులు

- పక్కనే ప్రభుత్వ పాఠశాల.. విద్యార్థుల భద్రతపై ఆందోళన
- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ అధికారులపై అసహనం

**కీసర, అక్టోబర్ 09 (జనంసాక్షి):**
జనావాసాల మధ్య సెల్‌ఫోన్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం మెయిన్ రోడ్డులో రాందేవ్ జువెలరీస్ పక్కన ఓ భవనంపై నిర్మిస్తున్న రూఫ్‌టాప్ సెల్‌ఫోన్ టవర్‌ను తొలగించాలని కోరుతూ శుక్రవారం నాగారం బస్టాప్ వద్ద ధర్నా చేపట్టారు. టవర్ నిర్మాణంతో పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**పిల్లల భద్రతకు భరోసా ఏదీ?**

టవర్ సమీపంలోనే ప్రభుత్వ పాఠశాల ఉండటంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లలు రోజూ ఇదే పరిసరాల్లో తిరుగుతుంటారని, జనావాసాల మధ్య టవర్ నిర్మిస్తుంటే తమ భద్రతకు భరోసా ఎవరిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. టవర్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? భవనం టవర్ భారాన్ని తట్టుకునే సామర్థ్యం కలిగి ఉందా? ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు.

**ఫిర్యాదు చేసినా స్పందించరా?**

సెల్ టవర్ నిర్మాణంపై ఇప్పటికే ఘట్‌కేసర్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా పనులు కొనసాగించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. టవర్‌కు సంబంధించిన ఎస్‌పీఎస్ఎఫ్‌వో/ డీఓటీ అనుమతులు, ఈఎంఎఫ్ రేడియేషన్ కొలతల నివేదికలు, భవనం నిర్మాణ సామర్థ్యాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని, స్థానికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టవర్ నిర్మాణాన్ని నిలిపివేసి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అక్కాల సురేశ్ కుమార్, శిలాసాగరం నాగేంద్ర, అన్నంరాజు అర్జున్, ఎదనోరి సాయి ఋషి, శరత్, సంపత్, వినోద్, మల్లేశ్, రాకేశ్, సాయికిరణ్, సాయిప్రసాద్, మామిళ్ల కృష్ణ, పోచయ్య, నాగేశ్, శిలాసాగరం మల్లేశ్ పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.







### పరిశ్రమల అనుమతులు
# సకాలంలో మంజూరు చేయాలి



**నారాయణపేట, అక్టోబర్ 9 (జనంసాక్షి):** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను నిర్దేశిత గడువులోగా మంజూరు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, టీఎస్-ఐపాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి, తక్షణమే పరిష్కరించాలని సూచించారు. పరిశ్రమల అనుమతుల మంజూరులో అనవసర జాప్యాన్ని నివారించి, దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిశీలించాలని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందేలా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ధ్రువపత్రాల విషయంలో దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించి, నూతన పరిశ్రమలకు సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎంటర్‌ప్రైజెస్‌కు సంబంధించి 16 యూనిట్లు, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్‌కు సంబంధించి 5 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడించారు.
పరిశ్రమల అభివృద్ధితో పెట్టుబడులు, స్థానిక ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామలింగేశ్వర్ గౌడ్, డీఆర్‌డీవో వెంకట్ రాములు, ఎల్‌డీఎం సురేశ్ ఆత్రేయతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

- కావలి చంద్రయ్య సూచన
- ఎస్సీ సెల్ చైర్మన్‌ను కలిసిన పంగ శ్రీహరి



**కీసర, అక్టోబర్ 09 (జనంసాక్షి):**
కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కావలి చంద్రయ్య సూచించారు. నాగారం ఐదో డివిజన్ ఎస్సీ సెల్ చైర్మన్ పంగ శ్రీహరి శుక్రవారం చంద్రయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మెమెంటో అందజేసి సత్కరించారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పార్టీ అభివృద్ధి కోసం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, పనిచేయాలని చంద్రయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కిష్టిగారి రవి, డివిజన్ కార్యదర్శి చల్ల మనోహర్ పాల్గొన్నారు.

# గణేష్‌పూర్‌లో అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలి

- ఎస్పీకి వినతిపత్రం అందించిన సర్పంచ్ రేవంత్



**న్యాల్‌కల్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మండలంలోని గణేష్‌పూర్ గ్రామ శివారులో నిమ్జ్ భూములను కబ్జాచేసి అక్రమంగా ఎర్రరాయి తవ్వకాలు చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హుసేల్లి సర్పంచ్ రేవంత్ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌ను కోరారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నుంచి సుమారు 200 ఎకరాలకు పైగా భూములను సేకరించి, పరిహారం అందించి, చుట్టూ కంచె ఏర్పాటు చేశాయని తెలిపారు.
అయినప్పటికీ కొందరు స్థానికులు, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు భూములను ఆక్రమించి మైనింగ్ కొనసాగిస్తున్నారని ఆరోపించారు. గతంలో డీఎస్పీ పరిశీలించి హెచ్చరించినా తవ్వకాలు ఆగలేదన్నారు. సరిహద్దు గ్రామాల్లో చోరీలు పెరిగి రైతులు నష్టపోతున్నారని వివరించారు. సమస్యలపై ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు.

# బస్తీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- డీఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి





**హైదరాబాద్, అక్టోబర్ 09 (జనంసాక్షి):**
బస్తీ దవాఖానలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం నాంపల్లి క్లస్టర్ పరిధిలోని ఖైరతాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పూల్‌బాగ్ బస్తీ దవాఖానను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, వివిధ రికార్డులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అవసరమైన మందుల నిల్వలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని స్పష్టం చేశారు. గర్భిణుల సంరక్షణ, చిన్నారులకు టీకాల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి వ్యాధుల నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థంగా నిర్వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

# నేరాల నియంత్రణకు సాంకేతికతను సమర్థంగా వినియోగించాలి

- పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి: ఎస్పీ డి. సునిత రెడ్డి



**వనపర్తి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు వేగవంతం, పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ డి. సునిత రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.
ప్రతి ఎఫ్ఐఆర్‌ను ఈ-సాక్ష్య విధానంలో నమోదు చేసి, కేసులకు సంబంధించిన ఆధారాలను నిబంధనల ప్రకారం సేకరించాలని ఆదేశించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) నిబంధనల ప్రకారం 60, 90 రోజుల గడువుతో సంబంధం ఉన్న కేసుల దర్యాప్తును నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్‌లు, జీరో ఎఫ్ఐఆర్‌లపై తక్షణ చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.

**సాంకేతికతతో దర్యాప్తు వేగవంతం...**

టీజీ కాప్, హెచ్ఆర్ఎంఎస్, సీఈఐఆర్ పోర్టల్లను సమర్థంగా వినియోగించుకుంటూ పోలీసు విధులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని ఎస్పీ తెలిపారు.
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కేసులను త్వరగా పరిష్కరించాలని, నాట్‌గ్రిడ్ వ్యవస్థను నిబంధనల ప్రకారం ఉపయోగిస్తూ సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం పెంచుకోవాలని ఆదేశించారు.

**పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం...**

డయల్-112 ద్వారా వచ్చే అత్యవసర ఫిర్యాదులపై వెంటనే స్పందించి బాధితులకు సకాలంలో సహాయం అందించాలన్నారు. ఈ-పెట్టీ కేసులు, ఐటీ యాక్ట్ కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, ఇతర పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. చార్జ్‌షీట్ల దాఖలు శాతాన్ని పెంచడంతో పాటు సమన్లు, వారెంట్ల అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు. పోలీసు అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీతో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.